తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | శుక్రవారం - 11 - సెప్టెంబర్ - 2026 | సంపుటి : 4 | సంచిక : 99 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




# బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టాలి

- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి
- ఎమ్మెల్యేలు అసెంబ్లీకి తప్పనిసరిగా హాజరుకావాలి
- సభా చర్చల్లో చురుగ్గా పాల్గొనాలని సీఎం రేవంత్ సూచన
- ప్రతిపక్ష వ్యూహాలను ప్రజలకు వివరించాలని పిలుపు

**హైదరాబాద్, సెప్టెంబర్ 10, (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రతిపక్ష బీఆర్ఎస్ చేస్తున్న కుట్రలను దీటుగా తిప్పికొట్టడంతో పాటు, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఆయన అధ్యక్షతన కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, అసెంబ్లీ సమావేశాల నిర్వహణ, ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం, ప్రతిపక్ష విమర్శలను ఎదుర్కోవడం తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల ఫలితాలను ప్రజలకు వివరించే బాధ్యత ఎమ్మెల్యేలపై ఉందని సీఎం సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1,000 రోజులు పూర్తయిన సందర్భంగా

మిగతా 2లో..

# విద్యుత్ రంగంలో సౌర విప్లవం: ఉప ముఖ్యమంత్రి

- విద్యుత్ రాయితీల భారం తగ్గించేందుకు కీలక నిర్ణయం
- పంపుసెట్లు, ఇళ్ల సౌర విద్యుదీకరణకు ప్రాధాన్యం
- 82 గ్రామాల్లో ప్రయోగాత్మక ప్రాజెక్టు ప్రారంభం
- గ్రామాల స్వయంవిద్యుత్ ఉత్పత్తే భవిష్యత్ లక్ష్యం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**హైదరాబాద్, సెప్టెంబర్ 10, (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్ర ఖజానాపై విద్యుత్ రాయితీల భారాన్ని తగ్గించడంతో పాటు ప్రజలకు నిరంతర హరిత ఇంధనాన్ని అందించే దిశగా ప్రజా ప్రభుత్వం చారిత్రక చర్యలు చేపడుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. శాసనసభలో విద్యుత్ రంగానికి సంబంధించిన అంశాలపై మాట్లాడిన ఆయన, వ్యవసాయ పంపు సెట్లకు ఏటా సుమారు రూ.14 వేల కోట్లు, 53 లక్షల ఇళ్లకు గృహజ్యోతి పథకం కింద సుమారు రూ.5 వేల కోట్లు కలిపి విద్యుత్ రాయితీల రూపంలో రాష్ట్రంపై దాదాపు రూ.18 వేల కోట్ల వార్షిక భారం పడుతోందని వివరించారు. ఈ భారాన్ని తగ్గించడంతో పాటు భవిష్యత్ విద్యుత్ అవసరాలను తీర్చేందుకు సౌర విద్యుత్‌ను విస్తృతంగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ పంపు సెట్లతో పాటు ఇళ్లను కూడా సౌర విద్యుత్ ఆధారితంగా మార్చే దిశగా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని భట్టి విక్రమార్క తెలిపారు. సూర్యరశ్మిని విద్యుత్ ఉత్పత్తికి వినియోగించడం ద్వారా సంప్రదాయ విద్యుత్‌పై ఆధారపడటాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు. దీనివల్ల ప్రభుత్వంపై పడుతున్న రాయితీల భారాన్ని క్రమంగా తగ్గించడంతో పాటు

మిగతా 2లో..

# తెలంగాణలో సమస్యలపై హరీశ్ ఆగ్రహం

- నీళ్ల కోసం ప్రజలు రోడ్డెక్కుతున్నారని విమర్శ
- విద్యుత్ కోసం రైతులు ధర్నాలు చేస్తున్నారని ఆరోపణ
- యూరియా కోసం చెప్పులు క్యూలో పెడుతున్నారని వ్యాఖ్య
- రైతులకు నీళ్లు అందించాలని రేవంత్‌కు డిమాండ్



**హైదరాబాద్, సెప్టెంబర్ 10, (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణలో నీరు, విద్యుత్, ఎరువుల కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా నీళ్ల కోసం ప్రజలు రోడ్డెక్కుతున్నారని, విద్యుత్ కోసం రైతులు ధర్నాలు చేస్తున్నారని, యూరియా కోసం రైతులు చెప్పులు క్యూలో పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత పరిస్థితులను తిరిగి తీసుకువస్తానని చెప్పారని, ఇప్పుడు నిజంగానే పాత రోజులను తీసుకొచ్చారని ఆయన ఎద్దేవా చేశారు.

మిగతా 2లో..

# పేదల ఆత్మగౌరవమే ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యం

- ప్రతి నియోజకవర్గంలో పేదలకు ఇళ్ల నిర్మాణం
- రెండో విడతలో 59 వేల గుడిసెలకు ప్రాధాన్యం
- ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఉచిత సాయం
- అర్హతే ప్రామాణికంగా ఇళ్ల కేటాయింపు: పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబర్ 10, (తెలంగాణ ముచ్చట్లు):**

పేదల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ వారు నివసించే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం శాసనసభలో ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, మేడేపల్లి సత్యం, అక్బరుద్దీన్, వెంకట్రామిరెడ్డి తదితరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. పేదలను వారి జీవనోపాధికి దూరంగా

మిగతా 2లో..

# కరెంటు కోతలపై కేటీఆర్ ఫైర్

- కాంగ్రెస్ పాలనలో విద్యుత్ సంక్షోభమంటూ విమర్శలు
- కొండారెడ్డిపల్లి రైతుల వీడియోను పంచుకున్న కేటీఆర్
- వోల్టేజ్ సమస్యలతో పంటలు ఎండుతున్నాయని ఆరోపణ
- రైతుల ఇబ్బందులపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన బీఆర్ఎస్ నేత

**హైదరాబాద్, సెప్టెంబర్ 10, (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు అందిన 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ స్థానంలో రాష్ట్రంలో మళ్లీ విద్యుత్ కోతలు, సరఫరా సమస్యలు మొదలయ్యాయని ఆరోపించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామమైన నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లికి చెందిన రైతులు తమ సమస్యలను వివరిస్తున్న వీడియోను కేటీఆర్ సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో పంచుకున్నారు.



మిగతా 2లో..

# పంచాయతీలకు నిధులపై చట్టసవరణ



- పంచాయతీల సొంత ఆదాయం బ్యాంకు ఖాతాల్లోనే
- శాసనసభలో బిల్లుకు ఆమోద ముద్ర
- రూ.619 కోట్ల కేంద్ర నిధులు రావాల్సి ఉందన్న సీతక్క
- గ్రామాభివృద్ధి పనులకు నిధుల వినియోగం సులభతరం

**హైదరాబాద్, సెప్టెంబర్ 10, (తెలంగాణ ముచ్చట్లు):**

గ్రామ పంచాయతీలు తమ సొంత వనరుల ద్వారా సమకూర్చుకునే ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానా ఖాతాలో కాకుండా నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేసుకునేలా తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018లో సవరణ చేసేందుకు ఉద్దేశించిన బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రవేశపెట్టిన ఈ బిల్లుపై శాసనసభలో చర్చ అనంతరం ఆమోద ముద్ర వేశారు. చట్టంలోని 70వ సెక్షన్‌లోని మూడో ఉపవిభాగాన్ని సవరించడం ద్వారా గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని నేరుగా వాటి బ్యాంకు ఖాతాల్లో జమ చేసుకునే అవకాశం కల్పించనున్నారు. ఈ నిర్ణయం గ్రామస్థాయిలో నిధుల నిర్వహణను మరింత సులభతరం

మిగతా 2లో..

# ఎంఎస్‌డీ సాంకేతిక కేంద్రం ప్రారంభించిన మంత్రి

- జీవశాస్త్ర రంగంలో హైదరాబాద్‌కు మరింత ప్రాధాన్యం
- పరిశోధన, ఆవిష్కరణలకు ప్రభుత్వం పెద్దపీట
- నాలుగు లక్షల ఉద్యోగాలే లక్ష్యంగా ముందుకు
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**హైదరాబాద్, సెప్టెంబర్ 10, (తెలంగాణ ముచ్చట్లు):**

హైదరాబాద్‌లో ప్రపంచ ప్రఖ్యాత ఔషధ సంస్థ ఎంఎస్‌డీ ఏర్పాటు చేసిన నూతన సాంకేతిక కేంద్రాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రారంభించారు. హైదరాబాద్‌లో జీవశాస్త్రం, సాంకేతికత, ఆవిష్కరణ రంగాల సమ్మేళనానికి ఈ కేంద్రం మరో ముఖ్యమైన ముందడుగు అని మంత్రి పేర్కొన్నారు. ప్రపంచస్థాయి సంస్థలు తమ పరిశోధన, సాంకేతిక కార్యకలాపాలకు హైదరాబాద్‌ను ఎంచుకోవడం నగరానికి ఉన్న సామర్థ్యానికి నిదర్శనమన్నారు. ఎంఎస్‌డీ నూతన కేంద్రం ప్రపంచవ్యాప్తంగా సంస్థ కార్యకలాపాలకు అవసరమైన సాంకేతిక పరిష్కారాల అభివృద్ధికి కీలకంగా నిలవనుందని తెలిపారు. తెలంగాణలో ఇప్పటికే రెండు వేలకు పైగా జీవశాస్త్ర సంస్థలతో సమగ్ర వ్యవస్థ ఏర్పడిందని శ్రీధర్ బాబు తెలిపారు.

మిగతా 2లో..



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించేందుకే ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలను నిర్వహిస్తున్నామని రేవంత్ రెడ్డి పేర్కొన్నట్లు సమాచారం. ప్రభుత్వం ఇప్పటివరకు అమలు చేసిన కార్యక్రమాలు, చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజలకు అందుతున్న సంక్షేమ ఫలితాలను సభ వేదికగా వివరించాలని ఎమ్మెల్యేలకు సూచించారు. అయితే ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ సభా కార్యకలాపాలను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తోందని సీఎం విమర్శించారు. అధికారం కోల్పోయినప్పటికీ బీఆర్ఎస్ నేతల్లో అహంకారం తగ్గలేదని ఆయన వ్యాఖ్యానించినట్లు తెలిపారు.

బీఆర్ఎస్ సభ్యులు పోలీసులను, ప్రజాప్రతినిధులను దూషించడంతో పాటు మహిళా అధికారుల సమక్షంలో అనుచితంగా ప్రవర్తించారని ముఖ్యమంత్రి ఆరోపించారు. టీషర్టులు తొలగించి అసభ్యకరంగా ప్రవర్తించారని, సభా మర్యాదలకు విరుద్ధంగా వ్యవహరించారని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. స్పీకర్‌పై అత్యంత అభ్యంతరకరమైన భాషను ఉపయోగిస్తూ సభా కార్యక్రమాలకు విఘాతం కలిగించారని రేవంత్ రెడ్డి విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభకు ఉన్న గౌరవాన్ని ప్రతి సభ్యుడు కాపాడాల్సిన బాధ్యత ఉందని, సభా కార్యకలాపాలు సజావుగా జరిగేలా సహకరించాల్సిన అవసరం ఉందని సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వంపై జరుగుతున్న కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లి వాస్తవ పరిస్థితులను వివరించిన నాయకులు, కార్యకర్తలను సీఎం ఈ సందర్భంగా అభినందించారు. ప్రతిపక్షాల నుంచి వచ్చే విమర్శలకు సమర్థవంతంగా సమాధానం ఇవ్వడంతో పాటు, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించాలని ఎమ్మెల్యేలకు సూచించారు. రాజకీయంగా ప్రతిపక్షాలను ఎదుర్కోవడంలో పార్టీ ఎమ్మెల్యేలు సమన్వయంతో పనిచేయాలని, ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించడంలో చురుగ్గా వ్యవహరించాలని దిశానిర్దేశం చేశారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో వివరించాలని సూచించారు.

ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా తప్పనిసరిగా హాజరై సభా చర్చల్లో చురుగ్గా పాల్గొనాలని రేవంత్ రెడ్డి సూచించారు. ప్రభుత్వం తరపున ప్రవేశపెట్టే అంశాలపై సమర్థవంతంగా మాట్లాడటంతో పాటు, తమ నియోజకవర్గాలకు సంబంధించిన సమస్యలను కూడా సభ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ప్రతిపక్ష సభ్యులు సభా కార్యకలాపాలను అడ్డుకునే ప్రయత్నాలు చేసినా, ప్రజా సమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఎమ్మెల్యేలంతా సమన్వయంతో పనిచేస్తూ సభా కార్యకలాపాలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని సూచించారు.

ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడం, ప్రతిపక్ష ఆరోపణలకు సమర్థవంతంగా సమాధానం ఇవ్వడం, శాసనసభలో ప్రజా సమస్యలపై చురుగ్గా చర్చించడం వంటి అంశాలపై కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో ముఖ్యమంత్రి ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. అధికారంలో ఉన్న పార్టీగా ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, చేపట్టిన కార్యక్రమాలపై నిరంతరం ప్రజలకు వివరించాలని సూచించారు. అదే సమయంలో బీఆర్ఎస్ నుంచి వచ్చే రాజకీయ విమర్శలు, సభా కార్యకలాపాలకు సంబంధించిన వివాదాలపై వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు. ఎమ్మెల్యేలు అసెంబ్లీకి క్రమం తప్పకుండా హాజరై, చర్చల్లో చురుగ్గా పాల్గొని ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# పేదల ఆత్మగౌరవమే ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

30 నుంచి 40 కిలోమీటర్ల అవతలికి తరలించే విధానం తమ ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. ఎకరం భూమి రూ.150 కోట్ల నుంచి రూ.200 కోట్ల వరకు విలువ చేసే ప్రాంతాల్లో కూడా పేదవాడి ఆత్మగౌరవానికి తగిన విధంగా ఇల్లు కల్పించాలనే ఉద్దేశంతో ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. లాటరీలో ఎంపికైన ప్రతి లబ్ధిదారుడి వివరాలను అధికారులు ఇంటింటికీ వెళ్లి భౌతికంగా పరిశీలిస్తున్నారని తెలిపారు. ఇతర నియోజకవర్గాలకు చెందిన వారు లాటరీలో ఎంపికైనట్లు తేలితే వారి పేర్లను తప్పనిసరిగా తొలగిస్తామని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలకు అతీతంగా కేవలం అర్హతనే ప్రామాణికంగా తీసుకుని ఇళ్లను మంజూరు చేస్తున్నామని చెప్పారు. ప్రతిపక్ష సభ్యులు సూచించిన అర్హులైన పేదల పేర్లను కూడా పరిశీలించి అనుమతులు ఇచ్చామని తెలిపారు. ఎక్కడైనా అర్హులైన పేదలకు అన్యాయం జరిగితే తమ దృష్టికి తీసుకువస్తే పరిశీలించి పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర ప్రభుత్వం పేదలకు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల ఉచిత ఆర్థిక సహాయం అందిస్తున్న ఉదాహరణ లేదని, తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల కోసం రూ.5 లక్షలు అందిస్తున్నామని పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇంటి నిర్మాణానికి ప్రస్తుతం అందిస్తున్న రూ.5 లక్షల సాయం సరిపోవడం లేదని పలువురు శాసనసభ్యులు సూచించారని, ఆ అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని చెప్పారు. మొదటి విడతలో మంజూరు చేసిన 4.50 లక్షల ఇళ్లకు సుమారు రూ.22,500 కోట్లు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లకు సుమారు రూ.11 వేల కోట్లు, పట్టణ ప్రాంతాల్లో లక్ష ఇళ్లకు సుమారు రూ.5,500 కోట్లు అవసరమవుతాయని వివరించారు. రెండు విడతల్లో కలిపి సుమారు 8 లక్షల ఇళ్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.40 వేల కోట్లకు పైగా భరించాల్సి ఉంటుందని తెలిపారు. భవిష్యత్తులో మూడో, నాలుగో విడతల్లోనూ అర్హులైన పేదలకు ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. దశాబ్దాలుగా గుడిసెల్లోనే జీవిస్తున్న పేదలకు రెండో విడతలో ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన సుమారు 59 వేల గుడిసెలను రెండో విడతలో ప్రాధాన్యతగా తీసుకుని ఇందిరమ్మ ఇళ్లు నిర్మించనున్నట్లు వెల్లడించారు.

గతంలో ప్రభుత్వ అనుమతులతో ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించి, చిన్నచిన్న లోపాల కారణంగా పనులు నిలిచిపోయిన సుమారు 3,200 ఇళ్లను సక్రమం చేసి పరిష్కరించామని చెప్పారు. వారికి ఈ వారం చివర్లోనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే గతంలో వివిధ కారణాలతో సొంత డబ్బులతో పునాది, గోడలు లేదా పైకప్పు వరకు నిర్మించి ఆగిపోయిన ఇళ్లకు రెండో విడతలో ప్రత్యేక అవకాశం కల్పించామని చెప్పారు. ప్రతి 2,000 ఇళ్లలో 500 ఇళ్లను అసంపూర్తిగా ఉన్న ఇళ్లకు కేటాయించే కొత్త విధానాన్ని తీసుకొచ్చామని వివరించారు.

గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పేదల కోసం గుర్తించిన ప్రభుత్వ స్థలాలు, సేకరించిన భూముల్లో ఇంకా కేటాయింపులు జరగని స్థలాలను గుర్తించి అర్హులైన పేదలకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. నెల రోజుల్లోగా ఆయా నియోజకవర్గాల్లో అర్హులైన పేదలకు ఈ స్థలాలను అందించేలా కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. ఇంటి నిర్మాణంలో ప్రధానమైన సిమెంట్‌ను పేదలకు తక్కువ ధరకు అందించేందుకు పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సిమెంట్ కంపెనీలతో చర్చలు జరిపామని తెలిపారు. మార్కెట్లో ప్రస్తుతం రూ.310 నుంచి రూ.320 వరకు ఉన్న 50 కిలోల సిమెంట్ బస్తాను పేదలకు రూ.230కే అందించేలా ఒప్పందం పూర్తయిందని, త్వరలో ఈ విధానం అమల్లోకి వస్తుందని చెప్పారు. ఉక్కును కూడా తక్కువ ధరకు అందించే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేని, స్వయం సహాయక మహిళా సంఘాల్లో సభ్యులైన పేదలకు రూ.లక్షను ముందస్తు సాయంగా అందించే వెసులుబాటు కల్పించినట్లు వెల్లడించారు.

# కరెంటు కోతలపై కేటీఆర్ ఫైర్

(మొదటి పేజీ తరువాయి)

వీడియోను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. "కాంగ్రెస్ ఉంటే కరెంటు ఉండదు.. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రానికి వచ్చిన అసలైన మార్పు ఇదేనా?" అంటూ కేటీఆర్ తన పోస్టులో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గతంలో విద్యుత్ సరఫరాలో సాధించిన పురోగతిని ప్రస్తావిస్తూ, ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి పాలమూరు ప్రాంతంలోనే విద్యుత్ సరఫరా పరిస్థితి ఇలా ఉంటే రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉందనే ప్రశ్నను ఆయన లేవనెత్తారు. రైతులకు నిరంతరాయంగా విద్యుత్ అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.

కొండారెడ్డిపల్లికి చెందిన రైతులు విద్యుత్ కోతలు, తక్కువ వోల్టేజ్ కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేటీఆర్ ఆరోపించారు. సరిపడా వోల్టేజ్ లేకపోవడం, అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరా కాకపోవడంతో పొలాలకు నీరు అందించడంలో సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. విద్యుత్ మోటార్లు సైతం దెబ్బతింటున్నాయని, దీంతో రైతులు అదనపు ఆర్థిక భారాన్ని ఎదుర్కోవాల్సి వస్తోందని అన్నారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరా సమయానికి అందకపోవడం వల్ల పంటలపై ప్రతికూల ప్రభావం పడుతోందని కేటీఆర్ తన పోస్టు ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారు.

వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరా అనేది రైతుల సాగుకు అత్యంత కీలకమైన అంశమని కేటీఆర్ పేర్కొన్నారు. పంటలకు అవసరమైన సమయంలో నీరు అందకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ముఖ్యంగా మోటార్లు పనిచేయకపోవడం, తక్కువ వోల్టేజ్ వంటి సమస్యలు రైతుల సాగు ఖర్చులను మరింత పెంచుతాయని విమర్శించారు. గతంలో 24 గంటల ఉచిత విద్యుత్ అందించామని చెప్పుకున్న బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత పరిస్థితిని పోల్చుతూ కాంగ్రెస్ పాలనలో రైతులకు మళ్లీ పాతకాలపు విద్యుత్ కష్టాలు ఎదురవుతున్నాయని కేటీఆర్ ఆరోపించారు. ముఖ్యమంత్రి సొంత గ్రామానికే చెందిన రైతులు విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేస్తున్నారని కేటీఆర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాష్ట్ర పాలనలో కీలక స్థానంలో ఉన్న ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించే ప్రాంతంలోనే రైతులకు సరైన విద్యుత్ అందకపోవడం ఆందోళనకరమని అన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, వ్యవసాయానికి అవసరమైన విద్యుత్‌ను నాణ్యమైన వోల్టేజ్‌తో నిరంతరాయంగా అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, వోల్టేజ్ సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోతే వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని కేటీఆర్ హెచ్చరించారు. విద్యుత్ సరఫరా వ్యవస్థను బలోపేతం చేసి, రైతులకు హామీ ఇచ్చిన మేరకు నాణ్యమైన విద్యుత్ అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.

కొండారెడ్డిపల్లి రైతుల వీడియోను సోషల్ మీడియాలో పంచుకోవడం ద్వారా విద్యుత్ సరఫరా అంశాన్ని మరోసారి రాజకీయ చర్చలోకి తీసుకొచ్చారు. అయితే విద్యుత్ సరఫరా పరిస్థితి, రైతులు పేర్కొన్న సమస్యలపై ప్రభుత్వం లేదా విద్యుత్ శాఖ నుంచి అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది.

# పంచాయతీలకు నిధులపై చట్టసవరణ

(మొదటి పేజీ తరువాయి)

చేయడంతో పాటు స్థానిక అవసరాలకు నిధులను వేగంగా వినియోగించుకునేందుకు దోహదపడుతుందని ప్రభుత్వం పేర్కొంది. ప్రస్తుతం గ్రామ పంచాయతీలు తమ సొంత ఆదాయ వనరుల ద్వారా సమకూర్చుకునే నిధులను ప్రభుత్వ ఖజానా ఖాతాలో జమ చేయాల్సి వస్తోందని మంత్రి సీతక్క తెలిపారు. అనంతరం గ్రామ అవసరాలకు ఆ నిధులను వినియోగించుకోవాలంటే ఖజానా ద్వారా నిర్దిష్ట ప్రక్రియను అనుసరించి తిరిగి తీసుకోవాల్సి వస్తోందని వివరించారు. అనుమతులు, అవసరమైన పత్రాల సమర్పణ వంటి ప్రక్రియల కారణంగా కొన్నిసార్లు నిధుల వినియోగంలో జాప్యం జరుగుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల నిధులు ఇప్పటికే బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్న విధంగానే గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని కూడా నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేసుకునేలా చట్టాన్ని సవరిస్తున్నామని చెప్పారు. గ్రామ పంచాయతీల కోసం ప్రభుత్వం ప్రతి నెలా నిధులు విడుదల చేస్తోందని సీతక్క తెలిపారు. కేంద్రం నుంచి రావాల్సిన ఆర్థిక సంఘం నిధుల్లో సుమారు రూ.619 కోట్లు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. గత రెండేళ్లుగా 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయని, ఎన్నికలు పూర్తయిన తర్వాత పెండింగ్ నిధులు క్రమంగా విడుదల అవుతున్నాయని వివరించారు. స్థానిక సంస్థలకు సంబంధించి 2018లో స్టాంపు డ్యూటీ తొలగించడంతో ఆదాయ వనరులు తగ్గి కొంత ఆర్థిక సంక్షోభ పరిస్థితి ఏర్పడిందని మంత్రి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను ప్రభుత్వం కొనసాగిస్తోందని సీతక్క వెల్లడించారు. ప్రతి నెలా గ్రామ పంచాయతీలకు రూ.54 కోట్లు విడుదల చేస్తున్నామని తెలిపారు. సర్పంచ్‌లకు పంచాయతీరాజ్ శాఖ నుంచి చెల్లించాల్సిన పెండింగ్ నిధులు ఏమీ లేవని స్పష్టం చేశారు. ఎంపీలు, శాసనసభ్యుల నిధులతో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులను పంచాయతీరాజ్ శాఖను కోరుతున్న పరిస్థితి ఉందని వివరించారు. వివాదాల కారణంగా ఎన్నికలు జరగని గ్రామ పంచాయతీలకు కూడా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే నిధులు అందిస్తూ అభివృద్ధి పనులు కొనసాగిస్తోందని సభకు తెలిపారు. గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధిపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన వీజీజీ రాంజీ పథకం కారణంగా రాష్ట్రంపై సుమారు రూ.2 వేల కోట్ల అదనపు భారం పడుతున్నప్పటికీ ఇంకుడు గుంతలు, పంట కుంటలు, ఊట కుంటల నిర్మాణాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. వేల కిలోమీటర్ల గ్రామీణ రహదారులను హామ్ విధానంలో నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాన్ని కూడా పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్నామని వెల్లడించారు. ఇదే సమయంలో గ్రామ పంచాయతీల నిధులను సహకార బ్యాంకుల్లో జమ చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుపై జరిగిన చర్చలో పలువురు సభ్యులు గ్రామ పంచాయతీల ఆర్థిక పరిస్థితి, నిధుల విడుదల, స్థానిక అభివృద్ధి పనులు, బ్యాంకు ఖాతాల నిర్వహణ వంటి అంశాలపై సూచనలు చేశారు. బీజేపీ సభ్యులు పాయల్ శంకర్, పాల్వాయి హరీశ్‌తో పాటు కాంగ్రెస్ సభ్యులు విజయ రమణరావు, శంకర్ తదితరులు చర్చలో పాల్గొన్నారు. పంచాయతీల సొంత ఆదాయం నేరుగా బ్యాంకు ఖాతాల్లో అందుబాటులోకి రావడం ద్వారా స్థానిక అవసరాలకు నిధుల వినియోగం వేగవంతం అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. గ్రామస్థాయిలో ఆర్థిక కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయడానికి ఈ చట్టసవరణ ఉపయోగపడుతుందని మంత్రి సీతక్క తెలిపారు.

# విద్యుత్ రంగంలో సౌర విప్లవం: ఉప ముఖ్యమంత్రి

(మొదటి పేజీ తరువాయి)

రైతులు, గృహ వినియోగదారులకు స్థిరమైన విద్యుత్ అందించే అవకాశం ఏర్పడుతుందని వివరించారు. సౌర విద్యుత్ విస్తరణతో పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పాటు లభిస్తుందని అన్నారు.

అచ్చంపేట నియోజకవర్గంలోని అమ్రాబాద్‌తో పాటు మరో 81 గ్రామాల్లో సౌర విద్యుత్ ఆధారిత ప్రయోగాత్మక ప్రాజెక్టును ప్రభుత్వం ప్రారంభించిందని ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. మొత్తం 82 గ్రామాల్లో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో సౌర విద్యుత్ వినియోగ సామర్థ్యాన్ని పరిశీలించనున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు అమలు తీరును, విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని, ప్రజలకు కలిగే ప్రయోజనాలను పరిశీలించిన అనంతరం విజయవంతమైన నమూనాను మరింత విస్తృత స్థాయిలో అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు.

ఈ ప్రయోగాత్మక ప్రాజెక్టు విజయవంతమైతే మండల స్థాయికి విస్తరించి, సూక్ష్మ విద్యుత్ జాలాల ద్వారా గ్రామాలే తమకు అవసరమైన విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుని వినియోగించుకునే విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. గ్రామాల్లోనే విద్యుత్ ఉత్పత్తి, వినియోగం జరిగే విధానం అమలులోకి వస్తే విద్యుత్ సరఫరాపై ఒత్తిడి తగ్గడంతో పాటు స్థానికంగా విద్యుత్ అవసరాలను తీర్చుకునే అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ విధానం తెలంగాణ విద్యుత్ రంగంలో కీలక మార్పునకు నాంది పలుకుతుందని అన్నారు.

గిరిజన ప్రాంతాల్లోనూ సౌర విద్యుత్ వినియోగాన్ని వేగంగా పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఇందిరా సౌర గిరిజన వికాసం కార్యక్రమం ద్వారా గిరిజన ప్రాంతాల్లో సౌర శక్తిని ప్రోత్సహిస్తున్నామని వివరించారు. విద్యుత్ మౌలిక వసతులు పరిమితంగా ఉన్న ప్రాంతాల్లో సౌర విద్యుత్ అందుబాటులోకి తీసుకురావడం ద్వారా అక్కడి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు స్వచ్ఛమైన ఇంధన వినియోగాన్ని పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో విద్యుత్ అవసరాలను తీర్చడం, ప్రభుత్వ ఆర్థిక భారాన్ని తగ్గించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం అనే మూడు లక్ష్యాలను సమన్వయంతో సాధించేందుకు సౌర విద్యుత్ విస్తరణకు ప్రాధాన్యం ఇస్తున్నామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వ్యవసాయ రంగం, గృహ రంగం, గ్రామీణ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాల్లో సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచుతూ తెలంగాణను హరిత ఇంధన రంగంలో ముందంజలో నిలపాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. గ్రామాలే విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుని వినియోగించుకునే స్వయం సమృద్ధి నమూనాను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించడం ద్వారా భవిష్యత్ తరాలకు స్థిరమైన, పర్యావరణహిత విద్యుత్ వ్యవస్థను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

# తెలంగాణలో సమస్యలపై హరీశ్ ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని హరీశ్ రావు విమర్శించారు. సాగునీటి కోసం రైతులు ఎదురుచూస్తున్న సమయంలో ప్రభుత్వం సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని కోరారు. రైతుల పొలాలకు నీరు అందేలా సాగునీటి మోటార్లను వెంటనే నడిపించాలని డిమాండ్ చేశారు. ప్రజలు, రైతులు తమ సమస్యలపై ఆందోళనలకు దిగుతున్న పరిస్థితిని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలని సూచించారు.

శాసనసభలో ప్రతిపక్ష సభ్యుల ఆందోళనలను మార్షల్స్ ద్వారా అడ్డుకోవడం కంటే రైతులకు నీళ్లు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని హరీశ్ రావు వ్యాఖ్యానించారు. "మార్షల్స్‌తో మమ్మల్ని ఎత్తడం కాదు.. మోటార్లు ఆన్ చేసి రైతులకు నీళ్లు ఎత్తు" అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రైతుల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాధాన్యంగా ఉండాలని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మౌనం తెలంగాణ తాగునీరు, సాగునీటి ప్రయోజనాలకు శాపంగా మారుతోందని హరీశ్ రావు ఆరోపించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నీటి సమస్యలు ఎదురవుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. తాగునీటి అవసరాలతో పాటు సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతుల పరిస్థితిని ప్రభుత్వం పట్టించుకోవాలని డిమాండ్ చేశారు. నీటి వనరుల నిర్వహణపై స్పష్టమైన కార్యాచరణతో ముందుకు రావాలని కోరారు. మరోవైపు విద్యుత్ సరఫరా, యూరియా లభ్యత విషయంలోనూ రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని హరీశ్ రావు పేర్కొన్నారు. విద్యుత్ కోసం రైతులు ఆందోళనలు చేయడం, యూరియా కోసం దీర్ఘకాలం వేచి చూడాల్సి రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. రైతులకు అవసరమైన సమయంలో నాణ్యమైన విద్యుత్, తగినంత ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నీరు, విద్యుత్, ఎరువుల విషయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని హరీశ్ రావు ప్రభుత్వాన్ని కోరారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సాగునీటి మోటార్లను నడిపించి పంటలకు నీరు అందించాలని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలపై ప్రభుత్వం మౌనం వీడి తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ, రైతుల తరపున బీఆర్ఎస్ తమ పోరాటాన్ని కొనసాగిస్తుందని ఆయన పేర్కొన్నారు.

# ఎంఎస్‌డీ సాంకేతిక కేంద్రం ప్రారంభించిన మంత్రి

(మొదటి పేజీ తరువాయి)

క్రియాశీల ఔషధ పదార్థాలు, భారీ ఔషధాలు, సాధారణ ఔషధాలు, ఒప్పంద అభివృద్ధి-తయారీ, టీకాలు, వైద్య పరిశోధన, ఔషధ ఆవిష్కరణ వంటి విభాగాల్లో రాష్ట్రం బలమైన స్థానం సంపాదించిందన్నారు. గత రెండేళ్లుగా ప్రభుత్వం ఈ పునాదిని మరింత బలోపేతం చేస్తూ తయారీతో పాటు పరిశోధన, ఆవిష్కరణలు, అధునాతన అభివృద్ధి, ప్రపంచస్థాయి సామర్థ్యాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించిందని వివరించారు.

ప్రపంచస్థాయి సంస్థలను తెలంగాణకు ఆకర్షించే దిశగా ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు మంచి స్పందన లభిస్తోందని మంత్రి పేర్కొన్నారు. అమ్‌జెన్, ఎలి లిల్లీ, బ్రిస్టల్ మైయర్స్ స్క్విబ్, సనోఫీ, అలైన్ టెక్నాలజీ, జోయెటిస్ వంటి ప్రముఖ సంస్థలు రాష్ట్రంలో తమ కార్యకలాపాలను విస్తరిస్తున్నాయని తెలిపారు. జీనోమ్ వ్యాలీ జీవశాస్త్ర సామర్థ్యాలతో పాటు హైదరాబాద్‌లోని విస్తృత సాంకేతిక మౌలిక వసతులు ఒకే చోట అందుబాటులో ఉండటం వల్ల ప్రపంచ సంస్థలకు నగరం అత్యంత అనుకూల ప్రాంతంగా మారుతోందన్నారు. ఈ కలయిక శాస్త్రం, సాంకేతికత, నైపుణ్యం కలిగిన మానవ వనరులను ఒకే వేదికపైకి తీసుకువస్తుందని చెప్పారు.

ఎంఎస్‌డీ నూతన సాంకేతిక కేంద్రం ద్వారా డిజిటల్ సాంకేతికత, సమాచార విశ్లేషణ, కృత్రిమ మేధస్సు, ఇంజినీరింగ్ వంటి ఆధునిక సామర్థ్యాలు హైదరాబాద్‌లో మరింత బలోపేతం కానున్నాయని మంత్రి తెలిపారు. సంస్థ ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆరోగ్య రంగ కార్యకలాపాలకు ఈ కేంద్రం సాంకేతిక సహకారం అందించనుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో శాస్త్ర, సాంకేతిక రంగాల మధ్య ఉన్న అనుసంధానాన్ని మరింత పెంచేందుకు ఇలాంటి ప్రపంచస్థాయి కేంద్రాలు దోహదపడతాయని అన్నారు. తెలంగాణ జీవశాస్త్ర రంగాన్ని తయారీ కేంద్రం స్థాయి నుంచి అధిక విలువ కలిగిన పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని శ్రీధర్ బాబు తెలిపారు. ఇందుకోసం 2026-30 కాలానికి సంబంధించిన తదుపరి తరం జీవశాస్త్ర విధానం ద్వారా శాస్త్రం, సాంకేతికత, పరిశోధన రంగాల అనుసంధానాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది వంద ప్రపంచస్థాయి సామర్థ్య కేంద్రాల స్థాపనను లక్ష్యంగా పెట్టుకున్నామని, గత ఏడాది 75కు పైగా కేంద్రాలు ఏర్పాటయ్యాయని వెల్లడించారు. ఈ విస్తరణ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా నాలుగు లక్షల అధిక విలువ కలిగిన ఉద్యోగ అవకాశాలు సృష్టించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

# తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు



- **మున్సిపల్ నిధులతో పైపులైన్ పనులకు శంకుస్థాపన చేసిన-మేయర్**

**కరీంనగర్, సెప్టెంబర్ 10(తెలంగాణ ముచ్చట్లు ):**కరీంనగర్ నగరపాలక సంస్థ 34వ డివిజన్ పరిధిలోని ప్రియదర్శిని కాలనీలో మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న వాటర్ పైపులైన్ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులకు మెరుగైన తాగునీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సమీని పర్వీన్, కోఆప్షన్ సభ్యుడు నందకుమార్, కార్పొరేటర్లు కర్రె పద్మ అనిల్, ఎన్నం లక్ష్మీ ప్రకాష్, మున్సిపల్ అధికారులు, బీజేపీ నాయకుడు అజయ్ తదితరులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం



- **ఐలమ్మ పోరాటం నేటి తరాలకు స్ఫూర్తిదాయకం: సాయిని మల్లేశం**

**కరీంనగర్, సెప్టెంబర్ 10(తెలంగాణ ముచ్చట్లు ):** భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పుకణిక తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా బీజేపీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆమె విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం పాల్గొని చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు. ఆమె ధైర్యం, త్యాగం, పోరాట పటిమ తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె సాగించిన పోరాటం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

# వీరనారి ఐలమ్మకు ఘన నివాళి



**సత్తుపల్లి, సెప్టెంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాలను కొనసాగించాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ అన్నారు. ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని సత్తుపల్లి పట్టణంలో గురువారం నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. తొలుత పట్టణంలోని మెయిన్‌రోడ్డులో ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి దయానంద్ విజయ్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సత్తుపల్లి-వేంసూరు రోడ్డులోని ధోబీఘాట్‌లో పట్టణ రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఆమె పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు. సమాజంలో అణగారిన వర్గాల ఆత్మగౌరవం, హక్కుల కోసం ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని నాయకులు పేర్కొన్నారు. మహిళగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూనే అన్యాయానికి ఎదురు నిలిచిన ఆమె ధైర్యం నేటి తరానికి ఆదర్శమన్నారు. ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నకేశవరావు, రజక సంఘం పట్టణ అధ్యక్షుడు విరివాడ నాగభూషణం, వార్డు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

# సత్తుపల్లిలో బీఆర్ఎస్ నేతల హౌస్ అరెస్టులు

- **అక్రమ నిర్బంధాలతో ప్రజల గొంతును నొక్కలేరు.. బీఆర్ఎస్.**



**సత్తుపల్లి, సెప్టెంబర్ 10(తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్‌లో అసెంబ్లీ ముట్టడి, నిరసన కార్యక్రమాలకు బీఆర్ఎస్ పార్టీ పిలుపునిచ్చిన నేపథ్యంలో సత్తుపల్లి నియోజకవర్గంలో ఆ పార్టీ కీలక నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలను తెల్లవారుజాము నుంచే పోలీసులు ఇళ్ల వద్ద హౌస్ అరెస్ట్ చేయడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా ఖండించింది. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికీ రాజ్యాంగం కల్పించిందని పేర్కొంది. ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలను ముందస్తు అరెస్టులు, హౌస్ అరెస్టులతో అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. నిరసన కార్యక్రమాలను అణచివేసేందుకు నిర్బంధాలు చేపట్టడం సరికాదన్నారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు.. హౌస్ అరెస్టులతో ప్రజల గొంతును నొక్కలేరు అని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. బీఆర్ఎస్ శ్రేణులపై విధించిన అక్రమ నిర్బంధాలను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

# ట్యాంక్‌బండ్‌పై ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలి

- **వీరనారి పోరాట స్ఫూర్తి తరతరాలకు మార్గదర్శకం-యాదగిరి సునీల్‌రావు**

**కరీంనగర్, సెప్టెంబర్ 10(తెలంగాణ ముచ్చట్లు ):** తెలంగాణ సాయుధ పోరాటంలో ధైర్యసాహసాలతో పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి తరతరాలకు మార్గదర్శకమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా కరీంనగర్ కలెక్టరేట్ రోడ్డులోని ఐలమ్మ విగ్రహానికి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్‌తో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సునీల్‌రావు మాట్లాడుతూ.. నైజాం రజాకార్లు, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అన్నారు. మహిళలకు ఆమె ధైర్యసాహసాలు, పోరాట పటిమ గొప్ప ఆదర్శమని పేర్కొన్నారు. ఐలమ్మ త్యాగానికి తగిన గుర్తింపు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించి సముచిత గౌరవం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, బీజేపీ నాయకులు, రజక సంఘం ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ ఎమ్మెల్సీల సస్పెన్షన్ ఏకపక్ష నిర్ణయం

- **అధికార పక్షానికి ఒక న్యాయం.. ప్రతిపక్షానికి మరో న్యాయమా?**
- **సింగిరెడ్డి కురుమూర్తి పెద్దమందడి బీఆర్ఎస్ అధికార ప్రతినిధి**

**పెద్దమందడి,సెప్టెంబర్10(తెలంగాణ ముచ్చట్లు):** శాసనసభ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిలపై మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సస్పెన్షన్ వేటు వేయడాన్ని పెద్దమందడి మండల బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి కురుమూర్తి గురువారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ చర్య ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. సభా గౌరవం, పదవుల ప్రతిష్ఠను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని, అయితే నిబంధనల అమలులో అధికార, ప్రతిపక్షాలకు వేర్వేరు ప్రమాణాలు ఉండకూడదని కురుమూర్తి అన్నారు. అధికార పక్షానికి చెందిన నేతలు గతంలో ప్రతిపక్ష నేతలు, ప్రజాప్రతినిధులపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన సందర్భాల్లో ఇదే స్థాయిలో చర్యలు తీసుకున్నారా? అని ప్రశ్నించారు.అధికార పక్షం నేతలు తీవ్ర వ్యాఖ్యలు చేస్తే రాజకీయ విమర్శలుగా భావించి వదిలేస్తారు.. ప్రతిపక్ష ఎమ్మెల్సీలు మాట్లాడితే మాత్రం వెంటనే సస్పెన్షన్ విధిస్తారా? అని ఆయన నిలదీశారు. ఇది ఏ విధమైన ప్రజాస్వామ్య న్యాయమని ప్రశ్నించారు.సభా నిబంధనలు ఉంటే అవి అధికార పక్షానికైనా, ప్రతిపక్షానికైనా సమానంగా వర్తించాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో అధికార, ప్రతిపక్షాల గొంతుకలకు సమాన ప్రాధాన్యత ఉండాలని, ప్రతిపక్షాన్ని అణచివేసే విధంగా సస్పెన్షన్ చర్యలు తీసుకోవడం సరైన పద్ధతి కాదని అన్నారు.తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిలపై విధించిన సస్పెన్షన్‌ను పునఃపరిశీలించి ప్రజాస్వామ్య విలువలను కాపాడేలా నిర్ణయం తీసుకోవాలని సింగిరెడ్డి కురుమూర్తి డిమాండ్ చేశారు.




# చిలుకటోనిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషక వంటకాల ప్రదర్శన



**పెద్దమందడి,సెప్టెంబర్10(తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రీయ తొమ్మిదవ పోషణ్ మాసంలో భాగంగా వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం చిలుకటోనిపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ్ మేళా, పోషకాహార వంటకాల ప్రదర్శన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో వివిధ రకాల పోషకాహార వంటకాలను ప్రదర్శించి, వాటి ద్వారా లభించే పోషక విలువలను మహిళలు, చిన్నారుల తల్లులకు వివరించారు. ముఖ్యంగా శరీరానికి అవసరమైన మాంసకృత్తులు అధికంగా లభించే పప్పుధాన్యాలు, గుడ్లు, పాలు, చిరుధాన్యాలు తదితర ఆహార పదార్థాల ప్రాముఖ్యతను వివరించారు.అంగన్‌వాడీ కేంద్రంలో అందించే అదనపు పోషకాహారంతో తయారు చేయగల వంటకాలు, వేడి వండిన ఆహార పట్టికలోని వంటకాలు, గ్రామంలో స్థానికంగా లభించే ఆహార పదార్థాలతో తయారు చేసిన ప్రాంతీయ వంటకాలను ప్రదర్శించారు. తక్కువ ఖర్చుతో, సులభంగా లభించే పదార్థాలతో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తయారు చేసుకోవచ్చని అవగాహన కల్పించారు.రోజువారీ ఆహారంలో వివిధ రకాల ధాన్యాలు, పప్పులు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలు, గుడ్లు తదితరాలను చేర్చుకోవాలని సూచించారు. ఆహారంలో వైవిధ్యం పాటించడం ద్వారా శరీరానికి అవసరమైన అన్ని రకాల పోషకాలు అందుతాయని తెలిపారు.పోషణ్ మాసం సందర్భంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, మహిళలకు పోషకాహార ప్రాధాన్యతపై అవగాహన కల్పించడంతో పాటు స్థానికంగా లభించే ఆహార పదార్థాల వినియోగాన్ని ప్రోత్సహించారు.కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారుల తల్లులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# విశ్వకర్మ బ్రహ్మోత్సవాలకు యాదగిరి సునీల్ రావుకు ఆహ్వానం

- **క్యాంపు కార్యాలయంలో ఆహ్వాన పత్రిక అందజేసిన ఆలయ కమిటీ సభ్యులు**
- **ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సహకరిస్తానని హామీ**



**కరీంనగర్, సెప్టెంబర్ 10(తెలంగాణ ముచ్చట్లు ):** కరీంనగర్ కమాన్ రోడ్డులోని శ్రీ గాయత్రి విశ్వకర్మ సహిత శ్రీ గోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో నిర్వహించనున్న శ్రీమద్విరాట్ విశ్వకర్మ బ్రహ్మోత్సవాలకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావును ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. క్యాంపు కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆహ్వానాన్ని స్వీకరించిన యాదగిరి సునీల్‌రావు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా విశ్వకర్మ బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని, ఈసారి కూడా వేడుకలకు అవసరమైన ఏర్పాట్లకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ముత్తోజు రామ్‌కుమార్, వెగ్గళం రామకృష్ణ, ఎదులాపురం మహేష్, గోకులకొండ నర్సింహాచారి, వంగల నవీన్, గోకులకొండ కరుణాకర్, రాగటి కవిత తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తి వెంకటేశ్వర స్వామి ఆలయ స్వర్ణోత్సవాలకు చిన్న జీయర్ స్వామి

- **చిన్న జీయర్ స్వామిని ఆహ్వానించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**వనపర్తి,సెప్టెంబర్10(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించి యాభై ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా వచ్చే ఏడాది మార్చి 10, 11, 12 తేదీల్లో నిర్వహించనున్న స్వర్ణోత్సవ మహోత్సవాలకు చిన్న జీయర్ స్వామి హాజరుకానున్నారు. ఈ మేరకు ఆలయ ధర్మకర్త రఘునాథాచార్యులు, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చిన్న జీయర్ స్వామిని ఆహ్వానించారు.వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తన సతీమణి శారదారెడ్డి, కుమారుడు నవనీత్‌రెడ్డితో కలిసి చిన్న జీయర్ స్వామిని కలిసి స్వర్ణోత్సవ వేడుకలకు హాజరుకావాలని ఆహ్వానించారు. ఆహ్వానాన్ని సానుకూలంగా స్వీకరించిన చిన్న జీయర్ స్వామి, మార్చి 10, 11, 12 తేదీల్లో వనపర్తికి విచ్చేసి వేడుకల్లో పాల్గొంటామని తెలిపారు.ఐదు దశాబ్దాలుగా భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ స్వర్ణోత్సవాలను భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. చిన్న జీయర్ స్వామి హాజరుకానుండటంతో స్వర్ణోత్సవ వేడుకలకు మరింత ఆధ్యాత్మిక శోభ చేకూరనుంది.కార్యక్రమంలో పురపాలక సంఘ ఉపాధ్యక్షులు మధుసూదన్‌గౌడ్, మార్కెట్‌యార్డు మాజీ అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, మాజీ మండల పరిషత్ అధ్యక్షులు కిచ్చారెడ్డి, ఎస్.ఎల్.ఎన్. రమేష్, తిరుమల మహేష్, వికాస తరంగిణి సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# 22–ఏ భూముల సమస్యను పరిష్కరించాలి



- **కొడిమ్యాల తహసీల్దార్‌కు బీజేపీ మండల శాఖ వినతిపత్రం**

**చొప్పదండి, సెప్టెంబర్ 10(తెలంగాణ ముచ్చట్లు ):** చొప్పదండి నియోజకవర్గం కొడిమ్యాల మండల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో 22-ఏ భూముల సమస్యను పరిష్కరించాలని కోరుతూ గురువారం తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం పాల్గొన్నారు.
22-ఏ జాబితాలో ఉన్న భూముల సమస్యతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించి, అర్హులైన భూ యజమానులకు న్యాయం చేయాలని వారు కోరారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు

# సీఐ శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బీఆర్ఎస్ యువ నేత రాజారపు సుమన్



**ధర్మసాగర్,సెప్టెంబర్10(తెలంగాణ ముచ్చట్లు):** ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు చేపట్టిన సీఐ శ్రీనివాస్‌ను బీఆర్ఎస్ పార్టీ ధర్మసాగర్ మండల యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారపు సుమన్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.
ఇటీవల బదిలీపై ధర్మసాగర్‌కు వచ్చిన సీఐ శ్రీనివాస్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు. ధర్మసాగర్ మండలంలో శాంతిభద్రతలను కాపాడుతూ ప్రజలకు మరింత చేరువగా పోలీస్ సేవలు అందించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.
ప్రజల సమస్యలను సానుకూలంగా పరిష్కరించడంతో పాటు, యువతను చెడు వ్యసనాలకు దూరంగా ఉంచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, గ్రామీణ ప్రాంతాల్లో శాంతియుత వాతావరణం నెలకొల్పడంలో పోలీసుల పాత్ర ఎంతో కీలకమని రాజారపు సుమన్ పేర్కొన్నారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరిస్తూ మండలంలో ప్రశాంతమైన వాతావరణం కొనసాగేందుకు తమ వంతు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజల సమస్యలను చట్టపరంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఎదురైనా పోలీసులను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నూతన ఎస్‌హెచ్‌ఓకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి



- **పూలమాల వేసి నివాళులర్పించిన మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్**

**స్టేషన్ ఘనపూర్,సెప్టెంబర్10(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి (చిట్యాల) ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలను స్టేషన్ ఘనపూర్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని 18వ వార్డు కౌన్సిలర్ పొన్న రవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, ప్రజాప్రతినిధులు, రజక కుల సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఐలమ్మ సేవలను, పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు.
ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ పోషించిన పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఆనాడు రజాకారుల దౌర్జన్యాలను, భూస్వాముల అక్రమాలను ధైర్యంగా ఎదిరించి పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. మహిళలు సైతం అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడగలరని నిరూపించిన ధీరవనిత ఐలమ్మ అని కొనియాడారు. ఆమె ఆశయాలను నేటి తరానికి తెలియజేస్తూ, సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పొన్న రవి, పొన్న రాజేష్, బొల్లు లక్ష్మీ, అంగడి రజితకృష్ణ, బూర్ల రాజేశ్వర్, తాటికొండ మధు, సౌదరపల్లి సంపత్ రాజ్, గుర్రం హరినాథ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అంబటి కిషన్ రాజు, కొలిపాక సతీష్, మాజీ ఎంపీటీసీ గట్టు రమేష్, పెసరు సారయ్య, తోకల రాజు, 18వ వార్డు అధ్యక్షుడు మామిళ్ల శ్రీనివాస్, రజక సంఘం నాయకులు పొన్న సత్యనారాయణ, రిటైర్డ్ ఉద్యోగి పొన్న రమేష్, పొన్న మధు, చందు శ్రీకాంత్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

**చాగల్లు లో ఐలమ్మ చిత్రపటానికి నివాళులు**

స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చాగల్లు బస్టాండు వద్ద కూడా చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 8వ వార్డు కౌన్సిలర్ పొన్న రాజేష్ ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చేసిన పోరాటాన్ని స్మరించుకుంటూ ఆమె ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో రజక సంఘం పెద్దమనుషులు పొన్న రవీందర్, పొన్న రాజయ్య, మచ్చ వెంకటయ్య, పొన్న యాకయ్య, పొన్న రాజేష్, సంతోష్, గ్రామస్తులు మహమ్మద్ సాదిక్, లక్ష్మీనారాయణ, విజయ్, రాజయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# వీరవనిత ఐలమ్మ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలి

- **ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి**
- **సీపీఎం మండల కార్యదర్శి మునిగేల రమేష్**



**స్టేషన్ ఘనపూర్, సెప్టెంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరవనిత చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని పురస్కరించుకొని స్టేషన్ ఘనపూర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి మునిగేల రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఐలమ్మ పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు.ఈ సందర్భంగా మునిగేల రమేష్ మాట్లాడుతూ.. తెలంగాణలో దొరలు, భూస్వాముల దోపిడీ, అణచివేతకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. భూమి, హక్కులు, ఆత్మగౌరవం కోసం ఆమె సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. అణచివేతకు ఏమాత్రం భయపడకుండా ఎర్రజెండా అండతో పోరాడి, బడుగు బలహీన వర్గాల ప్రజల్లో ధైర్యం, పోరాట స్ఫూర్తిని నింపారని గుర్తు చేశారు.ఐలమ్మ జీవితం నేటి యువతకు ఆదర్శంగా నిలవాలని ఆయన అన్నారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, దోపిడీ, అణచివేతను ప్రశ్నించేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఐలమ్మ స్ఫూర్తితో నేటి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటాలు నిర్వహించాలని సూచించారు.పేదలు, రైతులు, కార్మికులు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ సాగించిన పోరాటం నేటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రజల హక్కుల కోసం సాగించిన ఐలమ్మ పోరాటం అణచివేతకు వ్యతిరేకంగా నిలిచిన ధైర్యానికి ప్రతీక అని అన్నారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఐలమ్మకు నిజమైన నివాళి అని రమేష్ పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు కుర్ర ఉప్పలయ్య, కత్తుల రాజు, గట్ల మల్లారెడ్డి, తోడెంగల ఐలయ్య, చిలుముల్ల భాస్కర్, మంద మహేందర్, మేదరబోయిన కరుణాకర్ యాదవ్, పిట్టల రాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# కృత్రిమ మేధస్సుతో యువతకు ఉజ్వల భవిష్యత్తు

- **పలుస శంకర్ గౌడ్, జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షులు**



**వనపర్తి,సెప్టెంబర్10(తెలంగాణ ముచ్చట్లు-):** ప్రపంచం వేగంగా కృత్రిమ మేధస్సు వైపు అడుగులు వేస్తున్న నేపథ్యంలో యువత కృత్రిమ మేధస్సుపై అవగాహన పెంచుకుని, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ అన్నారు.వనపర్తి పట్టణంలోని వెల్నెస్ కేంద్రంలో గోపిరెడ్డి జైపాల్‌రెడ్డి స్మారకార్థం సత్య సోదక్ సమతా సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 30 రోజుల ఉచిత కృత్రిమ మేధస్సు శిక్షణా కార్యక్రమాన్ని పలుస శంకర్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కృత్రిమ మేధస్సు కేవలం సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే కాదని, భవిష్యత్తులో ఉపాధి అవకాశాలకు ఒక ముఖ్యమైన మార్గమని పేర్కొన్నారు.యువత కృత్రిమ మేధస్సును నేర్చుకుంటే ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల యువత కూడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకుని ప్రపంచ స్థాయి అవకాశాలను సొంతం చేసుకోవాలని సూచించారు. నైపుణ్యం, కృషి, క్రమశిక్షణతో శిక్షణను పూర్తిచేసుకుంటే నెలకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని అన్నారు.శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ధ్రువపత్రాలతో పాటు ఉపాధి అవకాశాలపై మార్గనిర్దేశం చేస్తామని తెలిపారు. యువత ఈ ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని కోరారు.గోపిరెడ్డి జైపాల్‌రెడ్డి స్మారకార్థం ఆయన సోదరుడు గోపిరెడ్డి సునీల్‌రెడ్డి సొంత నిధులతో ఉచిత శిక్షణ కార్యక్రమానికి ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని శంకర్ గౌడ్ పేర్కొన్నారు. అనంతరం గోపిరెడ్డి సునీల్‌రెడ్డితో కలిసి శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కిరణ్ సాగర్, ఉపాధ్యక్షులు మద్దిలేటి, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ బీబీ, కోశాధికారి పి. శ్రీనివాసులు, కృత్రిమ మేధస్సు శిక్షకులు కిరణ్, ఆర్థిక సహకారదాత గోపిరెడ్డి సునీల్‌రెడ్డి, సంస్థ నిర్వాహకులు రామకృష్ణ, ఏత్తం కృష్ణయ్య, పి. బాలకృష్ణ, వై. బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# పోలీసు ఉద్యోగార్థులకు ఉచిత వసతి శిక్షణ

- **ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి 100 మంది అభ్యర్థుల ఎంపిక**

**మహబూబ్‌నగర్,సెప్టెంబర్ 10(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖలో ఉప నిరీక్షకులు, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వసతి శిక్షణ అందించనున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర సమన్వయకర్త గద్దె భాస్కర్, రాంకీ ఫౌండేషన్ అధ్యక్షులు మువ్వ రామిరెడ్డి తెలిపారు.పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పి. మధుకర్ స్వామి సారథ్యంలో రాంకీ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ గ్రీన్‌ల్యాండ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 17వ తేదీ రాత్రి 9 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. అభ్యర్థుల ఎంపిక కోసం రాష్ట్రవ్యాప్తంగా 13 కేంద్రాల్లో అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్, వనపర్తిలో పరీక్షా కేంద్రాలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రతిభ ఆధారంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన 100 మంది అభ్యర్థులను ఎంపిక చేసి, వారికి ఉచిత భోజనం, వసతితో పాటు దుస్తులు అందజేస్తామని తెలిపారు. శంషాబాద్‌లోని శిక్షణా ప్రాంగణంలో శిక్షణ కొనసాగుతుందని, పోలీసు నియామక ప్రక్రియలోని ప్రధాన పరీక్ష వరకు శిక్షణ అందిస్తామని వెల్లడించారు.పోలీసు ఉద్యోగాలకు సిద్ధమవుతున్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.



# ఎస్ఐఆర్ పై గ్రామసభ నిర్వహించిన తహసీల్దార్ మల్లికార్జున్

**పెద్దమందడి,సెప్టెంబర్10(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం దొడగుంటపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎస్ఐఆర్‌పై గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభకు తహసీల్దార్ మల్లికార్జున్ హాజరై ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన అంశాలను గ్రామస్థులకు వివరించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మల్లికార్జున్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్‌కు సంబంధించి ప్రజలు తమ వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితాలో పేర్లు, ఇతర వివరాల్లో ఏమైనా తప్పులు లేదా మార్పులు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు సక్రమంగా నమోదయ్యేలా అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. గ్రామసభలో ఎస్ఐఆర్ ప్రక్రియపై గ్రామస్థులకు అవగాహన కల్పించడంతో పాటు వారి సందేహాలను నివృత్తి చేశారు. ప్రజలు ఎలాంటి అపోహలకు గురికాకుండా అధికారుల సూచనలను పాటించాలని తహసీల్దార్ సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెంటయ్య, పెద్దమందడి ,ఖిల్లా గణపురం మండలాల మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కొత్త కాపు వెంకటేశ్వర్ రెడ్డి, పొన్నూరు శ్రీనివాస్ రెడ్డి, జానకి రాములు, సుదర్శన్, నిరంజన్, రాజశేఖర్ శెట్టి, బిఎల్ఓ లు సువర్ణ, జ్యోతి గ్రామపంచాయతీ సిబ్బంది, ఆర్ ఐ శంకర్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు , పాల్గొన్నారు.



# ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి

**కాజీపేట్ సెప్టెంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** కాజీపేట్ లోని సిద్ధార్థ నగర్ లో చాకలి ఐలమ్మ జంక్షన్ లో తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ 41 వర్ధంతి ని గురువారం మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పలువురు చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామలింగం మాట్లాడుతూ వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ అక్టోబర్ 18 సద్దుల బతుకమ్మ రోజున ఉంటుందన్నారు. దొరల గుండెల్లో వణుకు పుట్టించిన వీరనారి అని కొనియాడారు. మట్టి మనుషుల శ్రామిక శక్తి తెలంగాణ నేల విప్లవ పౌరుషానికి పరమోన్నత శిఖరమైన ఐలమ్మ సేవలను స్మరించు కున్నారు. ఈ కార్యక్రమంలో బర్ల యాకూబ్, పసునూరి మనోహర్, గుంటి కుమార్, చిలకపాటి శివ, కొత్త రవి, పోన గోటి వెంకట్రావు, తక్కలపల్లి నిఖిల్ రావు, మోడం సదానందం, కోల్లపెల్లి సమ్మయ్య, కూడూరి రాజు, కాసబోయిని తిరుపతి, దొడ్డి పాటి సమ్మయ్య, వైనాల బిక్షపతి, లకావత్ యాకూబ్, పైతరి సదానందం లతోపాటు తదితరులు పాల్గొన్నారు.



# సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు ముందుకు రావాలి



- ముల్కనూర్ ఎస్సై రాజు

**భీమదేవరపల్లి, సెప్టెంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** గ్రామాల్లో నేరాల నియంత్రణ, ప్రజల భద్రతకు సీసీ కెమెరాలు కీలకంగా పనిచేస్తాయని ముల్కనూర్ ఎస్సై రాజు అన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. మండలంలోని ముత్తారం గ్రామ పంచాయతీ, ముత్తారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 8 సీసీ కెమెరాలను గురువారం గ్రామ సర్పంచ్ భారతి జైపాల్ రెడ్డితో కలిసి ఎస్సై రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ పాలకవర్గం, ముదిరాజ్ సంఘం సభ్యులను సన్మానించి అభినందించారు.

ఈ సందర్భంగా ఎస్సై రాజు మాట్లాడుతూ గ్రామాల్లో తరచూ చోరీలు, ఇతర అసాంఘిక ఘటనలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాలను అరికట్టడంతో పాటు నిందితులను గుర్తించడంలో పోలీసులకు ఎంతో సహకారం లభిస్తుందని తెలిపారు. ముత్తారం గ్రామపంచాయతీని ఆదర్శంగా తీసుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు సహకరించాలని కోరారు.

ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం" అని పేర్కొంటూ, గ్రామాల్లో భద్రతను మరింత పటిష్టం చేసేందుకు సీసీ కెమెరాల నిఘా వ్యవస్థను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మాట్ల హరికుమార్, ముదిరాజ్ సంఘం సభ్యులు కూన పెద్ద కనకయ్య, కూన చిన్న కనకయ్య, కూన రాజా సమ్మయ్య, కూన శంకర్, కూన భిక్షపతి, కూన రమేష్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# విద్యార్థి నాయకులుగా బాధ్యతల స్వీకరణ



**ఎల్కతుర్తి, సెప్టెంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ఇందిరానగర్ బ్రాంచ్‌లో ఇన్వెస్టిచర్ సెర్మనీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన విద్యార్థి నాయకులు తమ బాధ్యతలను స్వీకరించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏజీఎం పద్మాకర్, అకాడమిక్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ హాజరయ్యారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, బాధ్యతాయుత ప్రవర్తన, సేవా భావాన్ని పెంపొందించడమే ఇన్వెస్టిచర్ సెర్మనీ ఉద్దేశమని పాఠశాల ప్రిన్సిపాల్ బండారి సంపత్ తెలిపారు.

ముఖ్య అతిథి ఏజీఎం పద్మాకర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని, అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో, నిజాయితీగా నిర్వర్తించాలని సూచించారు. నాయకత్వ బాధ్యతలు స్వీకరించిన విద్యార్థులు తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని అన్నారు.

అనంతరం నూతన విద్యార్థి నాయకులతో ప్రమాణ స్వీకారం చేయించారు. విద్యార్థుల మార్చ్‌పాస్ట్, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ శ్రీధర్, డీజీఎం చేతన్, ఏజీఎం పద్మాకర్, అకాడమిక్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ బండారి సంపత్, జోనల్ పీఈటీ ప్రవీణ్, పాఠశాల అకాడమిక్ డీన్ తిరుపతి, పీఈటీ ఉదయ్, రమ్య, ఇన్‌చార్జీలు గౌస్య, రజిత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సన్న రకాలు సాగు చేసిన రైతులు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

- మండల వ్యవసాయ అధికారి సైదులు యాదయ్య



**పెద్దమందడి,సెప్టెంబర్10(తెలంగాణ ముచ్చట్లు):** ప్రభుత్వం సూచించిన ఏడు సన్న రకాల వరి పంటలను సాగు చేసిన రైతులందరూ తమ వివరాలను ఈ నెల 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని వనపర్తి జిల్లా పెద్దమందడి మండల వ్యవసాయ అధికారి సైదులు యాదయ్య సూచించారు.పెద్దమందడి మండలంలోని సన్న రకాల వరి సాగు చేసిన రైతులు చివరి తేదీ కోసం వేచి ఉండకుండా సంబంధిత వ్యవసాయ అధికారులను సంప్రదించి తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. సెప్టెంబర్ 15వ తేదీనే చివరి గడువు అని మరోసారి స్పష్టం చేశారు.రైతులు నిర్దేశిత గడువులోపు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని, అనంతరం ఎలాంటి అవకాశం ఉండదని వ్యవసాయ శాఖాధికారి తెలిపారు. ప్రభుత్వ సూచనలను రైతులు గమనించి సకాలంలో వివరాలు నమోదు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# రైల్వే ఆసుపత్రిని తనిఖీ చేసిన పిసి ఎండి డాక్టర్ నిర్మల రాజారామ్



**కాజీపేట్ సెప్టెంబర్ 10 ( తెలంగాణ ముచ్చట్లు):** దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ లోని కాజీపేట జంక్షన్ పరిధిలో నున్న రైల్వే ఆస్పత్రిని గురువారం ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ నిర్మల రాజారామ్ తనిఖీ చేశారు. సికింద్రాబాద్ నుండి కాజీపేట కు వచ్చిన డాక్టర్ నిర్మల రాజారాం కు పలువురు పుష్పగుచ్చాలను ఇచ్చి శాలువ కప్పి స్వాగతం పలికారు. సికింద్రాబాద్ నుంచి తనిఖీ నిమిత్తం వచ్చిన రైల్వే పిసి ఎండి డాక్టర్ నిర్మల రాజారామ్ కు తెలంగాణ రైల్వే ఎంప్లాయిస్ జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, రైల్వే మజ్దూర్ యూనియన్ డీజిల్ బ్రాంచ్ చైర్మన్ పాక వేద ప్రకాష్, సౌత్ సెంట్రల్ రైల్వే రిటైర్ పెన్షనర్స్ అసోసియేషన్ బ్రాంచ్ కార్యదర్శి ఎం కె మూర్తి ల ఆధ్వర్యంలో పలు సంఘాల నేతలు సమస్యలు వివరించి వినతి పత్రాలను అందజేశారు. రైల్వే ఆసుపత్రులలో రోగులు ఎదుర్కొంటున్న పలు సమస్య ల గురించి ఆమెకు వివరించారు. ఈ సందర్భంగా నిర్మల రాజారాం మాట్లాడుతూ రైల్వే కార్మిక రోగులకు నాణ్యమైన వైద్యం అందించడమే రైల్వే శాఖ లక్ష్యమన్నారు. కాజీపేట రైల్వే ఆసుపత్రి కు సబ్ డివిజన్ కు చెందిన రైల్వే కార్మికుల రోగుల తాకిడి నిత్యం పెరుగుతుండటంతో రోగులకు వైద్యం అందించేందుకు కావలసిన వైద్యులు లేకపోవడంతో ఉన్న వైద్యులకు పనిభారం ఎక్కువ ఉంటుందన్నారు. అదనంగా వైద్యులు, వైద్య సిబ్బందిని త్వరలో నియమిస్తామని నాయకులకు ఆమె హామీ ఇచ్చారు. తీవ్ర అనారోగ్యం, ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులు నగరంలోని ప్రవేట్ ఆసుపత్రి తో పాటు నేరుగా హైదరాబాద్ సూపర్ స్పెషాలిటీ ప్రైవేట్ దవాఖానకు తరలించేందుకు స్థానిక రైల్వే సీనియర్ ఎం ఎస్ డాక్టర్ నిరంజన్ కు పూర్తి అధికారం ఇస్తున్నట్లు ఆమె తెలిపారు. రైల్వే కార్మికులు ,రైల్వే పెన్షనర్లకు, రైల్వే కుటుంబాలకు వైద్య పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైల్వే ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ కొంద్ర నర్సింగరావు, కో కన్వీనర్ శ్రీనివాస్, తిరుపతి ,రమేష్, రైల్వే మజ్దూర్ యూనియన్ డీజిల్ బ్రాంచ్ నాయకులు ఎస్కే జానీ మియా కోశాధికారి రాజేశ్వరరావు సహాయ కార్యదర్శి నరేష్ యాదవ్ కమిటీ సభ్యులు నాగరాజు, రాముల సదానందం, శివప్రసాద్, రైల్వే రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు సురేందర్ నాథ్, సంజీవయ్య, సారయ్య, గోపాలరావు లతో పాటు పాల్గొన్నారు.

# కాజీపేటలో ఆర్టీసీ బస్ స్టేషన్ కోసం స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్



**కాజీపేట్ సెప్టెంబర్ 10 ( తెలంగాణ ముచ్చట్లు):** ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలను అందించే లక్ష్యంతో ప్రతిపాదిత కాజీపేట శాశ్వత ఆర్టీసీ బస్ స్టేషన్ నిర్మాణానికి రైల్వేకు సంబంధించిన ప్రతిపాదిత స్థలాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ గురువారం పరిశీలించారు. ప్రస్తుతం సిటీ బస్సుల రాకపోకలు కొనసాగుతున్న రైల్వే స్టేషన్ ముందున్న స్థలాన్ని రైల్వే పాఠశాల స్థలం, రైల్వే స్టేడియం ప్రాంతంతో పాటు స్టేడియానికి ఎదురుగా ఉన్న రైల్వేకు చెందిన సుమారు ఎకరం భూమిని అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అలాగే కాజీపేట ప్రధాన రహదారి పక్కనే ఉన్న హైదరాబాద్ కు వెళ్లే ఆర్టీసీ బస్సులు ఆగే స్థలాన్ని ఆమె పరిశీలించారు. కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలో శాశ్వత బస్ స్టేషన్ నిర్మాణానికి అవసరమైన రైల్వే శాఖ ద్వారా ప్రతిపాదిత భూమిని సమకూర్చుకోవడం రైల్వే శాఖతో భూమి మార్పిడి ప్రక్రియను పూర్తి చేయడం తదితరాంశాలను అధికారులతో కలెక్టర్ చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆర్టిసి ఆర్ఎం భవాని ప్రసాద్, డిప్యూటీ ఆర్ ఎం కిషన్ రావు, డిఎం ధరమ్ సింగ్, కాజీపేట తహసిల్దార్ రాజు, రైల్వే శాఖ ఇన్స్పెక్టర్ ఆఫ్ వర్క్స్ శ్రీనివాస్, స్టేషన్ మేనేజర్ రవీందర్ లతా పాటు అధికారులు పాల్గొన్నారు.

# కొత్తపల్లి చెరువు నిమజ్జన ఏర్పాట్లపై మేయర్ పరిశీలన

- భక్తుల భద్రత, సౌకర్యాలకు ప్రాధాన్యం
- శాఖల సమన్వయంతో ముందస్తు చర్యలు



**కరీంనగర్, సెప్టెంబర్ 10(తెలంగాణ ముచ్చట్లు ):** కరీంనగర్ నగరంలోని కొత్తపల్లి చెరువు వినాయక నిమజ్జన ప్రాంగణాన్ని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గణేష్ నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకుని ప్రాంగణంలో చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు.

నిమజ్జన కేంద్రంలో నిరంతర విద్యుత్ వెలుగులు, స్వచ్ఛమైన తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున పోలీస్, మున్సిపల్, విద్యుత్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల భద్రత, భక్తుల సౌకర్యానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

కార్యక్రమంలో 17వ డివిజన్ కార్పొరేటర్ వేముల కవితచంద్రశేఖర్, 18వ డివిజన్ కార్పొరేటర్ వాసాల రమేష్, మున్సిపల్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# మట్టి గణపతితో పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం

- ప్రతి ఇంటా మట్టి వినాయకుడినే ప్రతిష్ఠించాలి: మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్, సెప్టెంబర్ 10(తెలంగాణ ముచ్చట్లు ):** వినాయక చవితిని పురస్కరించుకుని కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని మేయర్ కొలగాని శ్రీనివాస్ గురువారం ప్రారంభించారు. నగరంలోని అన్ని డివిజన్ల ప్రజలకు ఉచితంగా మట్టి గణపతి ప్రతిమలను అందిస్తున్నట్లు తెలిపారు. పీఓపీ, రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాలతో నీటి వనరులు కలుషితమై పర్యావరణానికి నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. మట్టి విగ్రహాలను పూజించడం ద్వారా పర్యావరణంతో పాటు జలవనరులను కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. "భక్తి ఉండాలి.. పర్యావరణ హితం కూడా ఉండాలి. ప్రతి ఇంటా మట్టి గణపతిని ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి" అని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, కార్పొరేటర్లు రవీందర్‌సింగ్, చాడగొండ బుచ్చిరెడ్డి, సరిళ్ల ప్రసాద్, కాంతాల జగన్‌రెడ్డి, తాటి ప్రభావతి, గుగ్గిళ్ల జయశ్రీ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సేవా సంకల్ప్ అభియాన్‌ను విజయవంతం చేయాలి

- నెల రోజుల పాటు సేవా కార్యక్రమాలు చేపట్టాలి: యాదగిరి సునీల్‌రావు




**కరీంనగర్, సెప్టెంబర్ 10(తెలంగాణ ముచ్చట్లు ):** భారతీయ జనతా పార్టీ కరీంనగర్ సౌత్ జోన్ ఆధ్వర్యంలో భగత్‌నగర్‌లోని పీఎంఎల్ బ్యాంకెట్ హాల్‌లో 'సేవా సంకల్ప్ అభియాన్' మండల కార్యశాల నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నిర్వహించనున్న సేవా కార్యక్రమాలపై సమావేశంలో చర్చించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు మాట్లాడుతూ నెల రోజుల పాటు రక్తదాన శిబిరాలు, పారిశుధ్య కార్యక్రమాలు, ఉచిత వైద్య పరీక్షలు, కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మోదీ దేశానికి అందిస్తున్న సేవలు, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు, వివిధ మోర్చాల ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి సౌత్ జోన్‌లో 'సేవా సంకల్ప్ అభియాన్'ను ఘనంగా విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సౌత్ జోన్ ఇన్‌చార్జి నిర్మలాదేవి, అధ్యక్షురాలు గాయత్రి, అభియాన్ ఇన్‌చార్జి పండుగ నాగరాజు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 24వ వార్డులో హెల్త్ క్యాంప్ ప్రారంభం

- హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహనతో పాటు వైద్య పరీక్షలు



**జమ్మికుంట టౌన్, సెప్టెంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణంలోని 24వ వార్డులో హెల్త్ క్యాంప్‌ను మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డు ప్రజలతో పాటు పట్టణ పరిధిలోని ఎవరైనా క్యాంప్‌లో వైద్య పరీక్షలు చేయించుకోవచ్చని తెలిపారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించడం, వ్యాధి బారిన పడిన వారిని తొలి దశలో గుర్తించి అవసరమైన జాగ్రత్తలు, వైద్య సేవలపై సూచనలు అందించడం క్యాంప్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రజలు అపోహలకు గురికాకుండా హెచ్ఐవీపై సరైన అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ కోరారు. కార్యక్రమంలో బూరుగుపల్లి రాము, డాక్టర్ మహోన్నత, సూపర్‌వైజర్ సదానందం, హెల్త్ అసిస్టెంట్ నరేందర్, ఏఎన్ఎంలు మంజుల, రజిత, ఆశా కార్యకర్తలు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# బీఆర్ఎస్వీ నాయకుల అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం

- **హామీలు నెరవేర్చే వరకు విద్యార్థులు, నిరుద్యోగుల తరఫున పోరాటం ఆగదు: కొమ్ము నరేష్**



**జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** బీఆర్ఎస్వీ నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని బీఆర్ఎస్వీ జమ్మికుంట టౌన్ అధ్యక్షుడు కొమ్ము నరేష్ తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ పార్టీగానీ, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గానీ, ఎమ్మెల్యే గానీ ఎలాంటి కార్యక్రమానికి పిలుపునివ్వకపోయినా నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం అప్రజాస్వామిక చర్య అని ఆయన అన్నారు.
ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, విద్యార్థులకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు, నిరుద్యోగులకు కల్పిస్తామని ప్రకటించిన అవకాశాలు, అణగారిన వర్గాలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు.
హామీల అమలులో ప్రభుత్వం విఫలమైతే ప్రజా సమస్యలపై మరింత బలమైన ఉద్యమాలు చేపడతామని నరేష్ హెచ్చరించారు. అక్రమ అరెస్టులతో తమ గొంతును అణచి వేయలేరని, హామీలు అమలయ్యే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

# తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం

- **వర్ధంతి సందర్భంగా ఘన నివాళులర్పించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్**



**జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన వీరవనిత చాకలి ఐలమ్మ అని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ అన్నారు.
చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని జమ్మికుంట పట్టణ పరిధిలోని ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ తెలంగాణ ప్రజల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన నిప్పుకణిక అని కొనియాడారు. ఆమె చూపిన పోరాట మార్గం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.
కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్లు కొలుగూరి సురేష్, ఫిరోజ్, పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, రజక సంఘం అధ్యక్షుడు వరంగంటి సదానందం, బూరుగుపల్లి రాము, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# బ్యానర్ల మధ్య బాబాసాహెబ్.. అంబేద్కర్ విగ్రహానికి ఇదేం దుస్థితి!

- **ప్రచారానికి వేదికగా మారిన మోత్కులగూడెం అంబేద్కర్ చౌరస్తా**




**జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ప్రచార బ్యానర్ల మధ్య కనుమరుగవుతున్న దృశ్యం జమ్మికుంట పట్టణంలోని మోత్కులగూడెం అంబేద్కర్ చౌరస్తాలో కనిపిస్తోంది. విగ్రహం ముందు వివిధ ప్రభుత్వ పథకాలు, సంస్థలకు సంబంధించిన ప్రచార బ్యానర్లు వరుసగా ఏర్పాటు చేయడంతో అంబేద్కర్ విగ్రహం అందం, ఔన్నత్యం కనుమరుగవుతున్న పరిస్థితి నెలకొంది. రాజ్యాంగ నిర్మాతగా దేశ ప్రజలకు స్ఫూర్తినిచ్చే మహనీయుడి విగ్రహం వద్ద పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణం ఉండాల్సి ఉండగా.. ప్రచార బ్యానర్లు, పోస్టర్లతో పరిసరాలు నిండిపోవడంపై పట్టణ ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అంబేద్కర్ విగ్రహం ముందు ఇలాంటి బ్యానర్ల ఏర్పాటు ఆయనకు ఇచ్చే గౌరవాన్ని తగ్గించేలా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అంబేద్కర్ విగ్రహం చుట్టూ ఉన్న అనవసరమైన బ్యానర్లు, పోస్టర్లను తొలగించి పరిసరాలను సుందరీకరించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రచారానికి వేదికగా కాకుండా.. రాజ్యాంగ విలువలకు, సామాజిక సమానత్వానికి ప్రతీకగా నిలిచేలా మోత్కులగూడెం అంబేద్కర్ చౌరస్తాను తీర్చిదిద్దాలని పట్టణ ప్రజలు అధికారులను కోరుతున్నారు.



# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

- **వర్ధంతి సందర్భంగా ఘన నివాళులర్పించిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు**

**ఇల్లందకుంట, సెప్టెంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, సబ్బండ వర్గాల ఆత్మగౌరవానికి, మహిళా చైతన్యానికి ప్రతీక చాకలి ఐలమ్మ అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంగిలే రామారావు అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం జమ్మికుంట పట్టణంలోని ఇందిరానగర్ చౌక్ వద్ద ఉన్న ఆమె విగ్రహానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇంగిలే రామారావు మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోయిందన్నారు. దొరల గడీలను ఎదిరించి అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చూపిన పోరాట పటిమ నేటి తరానికి ఆదర్శమన్నారు. తెలంగాణ ప్రజల తెగువను ప్రపంచానికి చాటిచెప్పిన ధీరవనిత ఐలమ్మ అని కొనియాడారు. మహిళా లోకానికి ఆమె జీవితం, పోరాటం నిరంతర స్ఫూర్తినిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు అశోక్, గోపాల్, రెడ్డి, సందీప్, అన్వేష్, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఐలమ్మ ఆశయాలే అణగారిన వర్గాలకు స్ఫూర్తి




**ఎల్కతుర్తి, సెప్టెంబర్ 10 ( తెలంగాణ ముచ్చట్లు):** వీరవనిత చాకలి ఐలమ్మ ఆశయాలే అణగారిన వర్గాలకు స్ఫూర్తి అని రజక సంఘం నాయకులు అన్నారు. ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. గురువారం ఎల్కతుర్తి బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద రజక సంఘం, వివిధ పార్టీలు, కుల సంఘాల నాయకుల ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రజక సంఘం నాయకులు తంగళ్లపల్లి రాజ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు నాయకులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలతో పోరాడి అణగారిన వర్గాల్లో ఆత్మవిశ్వాసాన్ని, పోరాట స్ఫూర్తిని నింపారని కొనియాడారు. భూస్వామ్య, పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఆమె చేసిన పోరాటం చరిత్రలో చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఐలమ్మ స్ఫూర్తితో సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం, అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు తంగళ్లపల్లి రమేష్, మండల అధ్యక్షులు సబ్బు కొమురయ్య, భువనగిరి స్వామి, అంచనగిరి సల్మాన్, గుడెల్లి శ్రీనివాస్, బోనగిరి సమ్మయ్య, వీరభద్ర, బోనగిరి కోటి, అశోక్, చీకటి లక్ష్మణ్, సర్పంచ్, ఉప సర్పంచ్ గోడిశాల రాజు, మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకులు గోడిశాల యాదగిరి గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు శీలం అనిల్ కుమార్, సీనియర్ నాయకులు డాక్టర్ రమేష్, శనిగరపు వెంకటేష్, బీఆర్ఎస్ నాయకులు అల్లం కొండ రాజు, గోడిశాల వినయ్ గౌడ్, కల్లు గీత కార్మిక సంఘం అధ్యక్షులు జనగాని లక్ష్మీనారాయణ గౌడ్, ప్రధాన కార్యదర్శి బత్తిని శ్రీనివాస్, సోషల్ మీడియా కన్వీనర్, సీనియర్ జర్నలిస్ట్ జనగాని ప్రవీణ్ గౌడ్, కందుకూరి మహేష్ చారి, రమేష్ చారి, వెంకటరమణతో పాటు వివిధ గ్రామాల సంఘాల పెద్దలు, కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

# శిరీష దశదిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య

- **నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలి.**




**అశ్వారావుపేట, సెప్టెంబరు 10 (తెలంగాణ ముచ్చట్లు):** ములకలపల్లి మండలం చవిటిగూడెం గ్రామానికి చెందిన ఊకె శిరీష దశదిన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇల్లందు మాజీ ఎమ్మెల్యే, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు గుమ్మడి నరసయ్య హాజరై శిరీష చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో గుమ్మడి నరసయ్య మాట్లాడుతూ.. శిరీష మృతికి కారణమైన నిందితులకు కఠిన శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శిరీష మృతిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఆమె కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. శిరీష మృతిపై వచ్చిన ఆరోపణలపై పోలీసులు ఎలాంటి పక్షపాతం లేకుండా సమగ్ర దర్యాప్తు చేపట్టాలని కోరారు. ఘటనకు సంబంధించిన వాస్తవాలను వెలికితీసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. హాస్పిటల్ యాజమాన్యంపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకులు నూపా భాస్కర్, జాటోత్ కృష్ణ, ప్రసాద్, సంయుక్త మండల కార్యదర్శి కోర్సా రామకృష్ణ, మండల నాయకులు నకిరికంటి నాగేశ్వరరావు, నూపా సరోజిని, ఎర్రగొర్ల రామారావు, శాత్రబోయిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి అభివృద్ధికి సహకరించండి.!

- **సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే రాగమయి దయానంద్.**

**సత్తుపల్లి, సెప్టెంబరు 10 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి మరింత సహకారం అందించాలని కోరుతూ ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని కలిశారు. గురువారం హైదరాబాద్‌లోని అసెంబ్లీలో సీఎం ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రజల అవసరాలు, సంక్షేమ పథకాల అమలుపై ముఖ్యమంత్రితో చర్చించారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశం అనంతరం ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గంలోని పలు సమస్యలను ఎమ్మెల్యే సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లో ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల నుంచి వస్తున్న వినతులు, స్థానికంగా నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు ముఖ్యమంత్రికి వివరించారు. సత్తుపల్లి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అవసరమైన నిధులు, ప్రభుత్వపరమైన సహకారం అందించాలని రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యే కోరారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, సత్తుపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి కొనసాగుతుందని ఎమ్మెల్యే రాగమయి దయానంద్ పేర్కొన్నారు.



# మళ్లీ పెరిగిన బంగారం ధరలు



**హైదరాబాద్, సెప్టెంబరు 10 (తెలంగాణ ముచ్చట్లు):** దేశీయ బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు గురువారం మరోసారి పెరిగాయి. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై రూ.1,200, 22 క్యారెట్లపై రూ.1,100, 18 క్యారెట్లపై రూ.900 చొప్పున పెరిగింది. దీంతో హైదరాబాద్ మార్కెట్‌లో ఉదయం 10 గంటల సమయంలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,55,510కు చేరింది. హైదరాబాద్‌లో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,42,550గా ఉండగా.. 18 క్యారెట్ల బంగారం రూ.1,16,830 వద్ద ట్రేడవుతోంది. తెలంగాణలోని వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ నగరాల్లోనూ ఇవే ధరలు నమోదయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, విశాఖపట్నం, కడప, కాకినాడ నగరాల్లో కూడా ఇదే స్థాయిలో ధరలు కొనసాగుతున్నాయి.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శం



**దమ్మపేట, సెప్టెంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ వీరనారి చిట్యాల ఐలమ్మ 41వ వర్ధంతిని సీపీఎం దమ్మపేట మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. దమ్మపేటలోని సీపీఎం కార్యాలయం సుందరయ్య భవన్‌లో జరిగిన కార్యక్రమానికి మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పిట్టల అర్జున్ ముఖ్య అతిథిగా హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన వర్ధంతి సభలో మాజీ జిల్లా కమిటీ సభ్యుడు దొడ్డా లక్ష్మీనారాయణ, జిల్లా కమిటీ సభ్యుడు పిట్టల అర్జున్, మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు మాట్లాడారు. భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టి చాకిరీ విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చిట్యాల ఐలమ్మ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. సామాన్య వృత్తిదారుల కుటుంబంలో జన్మించిన ఐలమ్మ అన్యాయాన్ని ప్రశ్నించే స్ఫూర్తితో జమీందార్లు, జాగీర్దార్ల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. 'నా భూమి.. నా హక్కు' అంటూ ఐలమ్మ సాగించిన పోరాటం నాటి రైతాంగంలో చైతన్యం నింపిందన్నారు. ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు నాయకులు ఐలమ్మకు అండగా నిలిచారని చెప్పారు. జమీందార్లకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడి, ఐలమ్మకు చెందిన భూమిని, అందులో పండిన పంటను తిరిగి ఆమె ఇంటికి చేర్చారని వివరించారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తితో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం విస్తరించిందని వక్తలు పేర్కొన్నారు. ఈ పోరాటం ద్వారా సుమారు మూడు వేల గ్రామాల్లో పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచినట్లు తెలిపారు. పోరాటంలో నాలుగు వేల మంది అమరులయ్యారని గుర్తుచేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి ప్రపంచ చరిత్రలోనే గొప్ప నేపథ్యం ఉందని పేర్కొంటూ వీరనారి ఐలమ్మకు ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు యండ్రాతి అప్పారావు, మోరంపూడి కేశవరావు, కొలికిపోగు శ్రీనివాసరావు, సీఐటీయూ మండల కన్వీనర్ మురహరి రఘు, మోరంపూడి రామ్మోహన్‌రావు, నారపోగు అనిల్, ఎస్కే జాన్‌పాషా, యండ్రాతి సత్యనారాయణ, పెనుబల్లి సూర్యం, బసవా శ్రీనివాసరావు, కోమటి వెంకటేశ్వరరావు, మోటేపల్లి ధర్మయ్య, కే. గోపిరాజు, చీకటి వెంకటలక్ష్మీనారాయణ, టి. రమేష్, సీతారాములు, కారం వెంకటేశ్వరరావు, కూరం సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# ఎల్ఎండి ఆయకట్టు రైతుల పంటలను కాపాడండి

- రెండు వారాలపాటు సాగునీరు విడుదల చేయాలి: ఆత్మ డైరెక్టర్ వంగల వెంకటరెడ్డి



**హుజురాబాద్ , సెప్టెంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** లోయర్ మానేరు డ్యాం దిగువ ఆయకట్టు కింద సాగు చేసిన రైతుల పంటలను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణమే సాగునీరు విడుదల చేయాలని వ్యవసాయ శాఖ జిల్లా ఆత్మ డైరెక్టర్ వంగల వెంకటరెడ్డి విజ్ఞప్తి చేశారు. వర్షాలు లేక, భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో బోరుబావుల్లో నీరు లేక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆయకట్టు పరిధిలో రైతులు ఎకరాకు సుమారు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేశారని తెలిపారు. ప్రస్తుతం పంటలు చివరి పొట్ట దశలో ఉన్నాయని, కీలక సమయంలో సాగునీరు అందకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. సాగునీటి కోసం రైతులు తీవ్ర ఆందోళనతో ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.

లోయర్ మానేరు డ్యాం నుంచి కనీసం రెండు వారాలపాటు సాగునీరు విడుదల చేస్తే పంటలు చేతికి వచ్చే అవకాశం ఉందని వెంకటరెడ్డి తెలిపారు. రైతుల పరిస్థితిని ప్రభుత్వం అర్థం చేసుకుని తక్షణమే నీటిని విడుదల చేయాలని కోరారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే సత్యం, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ బాబు ప్రత్యేక చొరవ తీసుకుని ఆయకట్టు రైతుల పంటలను కాపాడేందుకు సాగునీటి విడుదలకు కృషి చేయాలని వంగల వెంకటరెడ్డి రైతుల పక్షాన విజ్ఞప్తి చేశారు.



# దళితబంధు లబ్ధిదారులకు న్యాయం జరిగే వరకు పోరాటం

- హుజూరాబాద్‌లో రిలే నిరాహార దీక్ష గోడపత్రిక ఆవిష్కరణ

**హుజూరాబాద్, సెప్టెంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** దళితబంధు పథకం రెండో విడత పెండింగ్ లబ్ధిదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న హుజూరాబాద్ అంబేద్కర్ చౌరస్తా వద్ద నిర్వహించనున్న రిలే నిరాహార దీక్షకు సంబంధించిన గోడపత్రికను టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎనుగు మల్లారెడ్డి ఆవిష్కరించారు. తెలంగాణ రక్షణ సేన నాయకుడు బండ అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దళితబంధు పథకం అమలులో పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులకు అండగా నిలిచేందుకే రిలే నిరాహార దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. దళితబంధు అనేది ఎవరో ఇచ్చే భిక్ష కాదని, దళితుల ఆత్మగౌరవానికి సంబంధించిన హక్కు అని పేర్కొన్నారు. లబ్ధిదారులందరికీ న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. దళితబంధు లబ్ధిదారులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సెప్టెంబర్ 12న నిర్వహించే రిలే నిరాహార దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హుజూరాబాద్ నియోజకవర్గ ముఖ్య నాయకులు సంతోష్ కుమార్ యాదవ్, కోరపల్లి సురేష్, టీఆర్ఎస్ నాయకులు అంబాల హరీష్, కిరణ్, నరేష్, రితీష్‌తో పాటు యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు

- ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

**హుజురాబాద్, సెప్టెంబర్ 10(తెలంగాణ ముచ్చట్లు ):** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను హుజురాబాద్ పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. బీసీ ఆజాది ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలుకమారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఐలమ్మను స్మరించుకుంటూ నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో ధైర్యసాహసాలకు, భూస్వామ్య వ్యతిరేక పోరాటానికి ప్రతీకగా నిలిచిన ప్రముఖ మహిళా యోధురాలని అన్నారు. చిట్యాల ఐలమ్మగా కూడా ప్రసిద్ధి చెందిన ఆమె నిజాం పాలన కాలంలో దొరలు, భూస్వాముల దోపిడీ, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా పేద ప్రజల పక్షాన నిలిచి పోరాడారని తెలిపారు.

తనకు సాగు హక్కు ఉన్న భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నించిన భూస్వామ్య శక్తులను ఐలమ్మ ధైర్యంగా ఎదుర్కొన్నారని, తన భూమిని కాపాడుకోవడంతో పాటు పేద రైతులు, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాటం చేశారని పేర్కొన్నారు. అన్యాయాన్ని ఎదిరించి హక్కుల కోసం పోరాడిన ఐలమ్మ స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రజక యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు నిమ్మటూరి సాయికృష్ణ, బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, రజక సంఘం పట్టణ అధ్యక్షులు కొండపాక శ్రీనివాస్, 15వ వార్డు కౌన్సిలర్ బానోతు వెంకట్, సుంకరి రాజమౌళి, సుంకరి రాజేందర్, జర్నలిస్టు జూపాక శివమణి, పిట్ట శ్రీనివాస్, చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దేవసాని ప్రియదర్శిని, కొలిపాక క్రాంతి కుమార్ తదితరులు పాల్గొని చాకలి ఐలమ్మకు ఘన నివాళులు అర్పించారు.

# దళితులు నడిస్తే మైళ అంటుతదా?

- దళితులను అవమానించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి: పిల్లి సుధాకర్



**హైదరాబాద్, సెప్టెంబర్ 10(తెలంగాణ ముచ్చట్లు ):** దళితులను కించపరిచేలా పరుష పదజాలంతో మాట్లాడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం నాంపల్లిలోని మానవ హక్కుల కమిషన్‌లోనూ ఫిర్యాదు అందజేశారు.

ఈ సందర్భంగా పిల్లి సుధాకర్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 7న అసెంబ్లీ ప్రారంభం సందర్భంగా జరిగిన తోపులాటలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ దళిత సామాజిక వర్గానికి చెందిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఉద్దేశించి చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పరుష వ్యాఖ్యలు తీవ్రంగా బాధించాయని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నత పదవుల్లో ఉన్న దళితులకే ఇలాంటి అవమానాలు ఎదురైతే సామాన్య దళితుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

అదేవిధంగా ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వద్ద దళితులు నిరసన తెలిపిన అనంతరం పసుపు నీళ్లు, పాలు చల్లి శుద్ధి చేసిన ఘటన దళితులను అవమానించడమేనని ఆయన ఆరోపించారు. ఈ ఘటనకు సంబంధించి బీఆర్ఎస్ నాయకురాలు పావని గౌడ్‌పై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కమిషన్‌ను కోరారు.

"సన్నాసులు, సవటలు, మురికి వెధవలు" వంటి పదజాలంతో దళితులను అవమానించడం అత్యంత అమానవీయమని పిల్లి సుధాకర్ అన్నారు. ఒకవైపు కృత్రిమ మేధస్సు (AI)తో ప్రపంచం వేగంగా ముందుకు సాగుతుంటే, మరోవైపు స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా కుల వివక్ష, అంటరానితనం వంటి భావనలు కొనసాగడం దురదృష్టకరమన్నారు.

దళితులను అవమానించే ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై, వారి వెనుక ఉన్న నాయకత్వంపైనా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్, మానవ హక్కుల కమిషన్‌ను కోరారు. దళితుల ఆత్మగౌరవం, రాజ్యాంగ హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు.

ఫిర్యాదు చేసిన వారిలో జాతీయ ప్రధాన కార్యదర్శి భైరి రమేష్, జాతీయ అధికార ప్రతినిధి దార సత్యం, రాష్ట్ర పొలిట్‌బ్యూరో చైర్మన్ ర్యాకం శ్రీరాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య, బుట్టి సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు నాయకోటి రవికాంత్, నీరుడి స్వామి, కాల్వ నరేష్, లింగం కుమార్ తదితరులు పాల్గొన్నారు

# కోదండరాంకు శతకోటి జైభీమ్‌లు

- రోస్టర్ సవరణకు మద్దతివ్వాలి



**హైదరాబాద్,సెప్టెంబర్ 10(తెలంగాణ ముచ్చట్లు ):** ఎస్సీ రోస్టర్ సవరణ అంశంపై అసెంబ్లీలో గళం వినిపించిన ఆచార్య కోదండరాంకు లక్షలాది మాలల తరపున శతకోటి జైభీమ్‌లు తెలియజేస్తున్నామని జాతీయ మాల మహానాడు నాయకులు తెలిపారు.

జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్, జాతీయ ప్రధాన కార్యదర్శి భైరి రమేష్, జాతీయ అధికార ప్రతినిధి దార సత్యం గత రెండు రోజులుగా కోదండరాంతో కలిసి రోస్టర్ నివేదికను అసెంబ్లీకి అందజేశారు. రోస్టర్‌లోని సమస్యలను సరిదిద్ది మాలలకు న్యాయం చేయాలని కోరారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇస్తూనే మాదిగల వెనుకబాటుకు మాలలు కారణం కాదని గతంలో స్పష్టం చేసిన కోదండరాం సామాజిక న్యాయం కోసం కృషి చేస్తున్నారని నాయకులు కొనియాడారు.

హైదరాబాద్‌లో కోదండరాంను కలిసి నాయకులు ధన్యవాదాలు తెలిపారు. రోస్టర్ సవరణ జరిగే వరకు తమకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం చైర్మన్ బత్తుల రాంప్రసాద్, ర్యాకం శ్రీరాములు, మేడి అంజయ్య, బుట్టి సత్యనారాయణ, గార ఉపేందర్, నీరుడు స్వామి, కాల్వ నరేష్, లింగం కుమార్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

# సీఐడీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బెల్లపు స్వామి ఘన విజయం

- ప్రత్యక్ష ఎన్నికల్లో 259 ఓట్లు..
- ప్రత్యర్థిపై 144 ఓట్ల ఆధిక్యం




**హుజురాబాద్,సెప్టెంబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** పోలీస్ శాఖలో సిబ్బంది సంక్షేమ సంఘాల యూనిట్లకు సాధారణంగా ప్యానల్ విధానంలో ఎన్నికలు జరుగుతుండగా.. సీఐడీలో మాత్రం ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఎన్నికల్లో హుజురాబాద్ మండలం రంగాపూర్‌కు చెందిన ఎస్సై బెల్లపు స్వామి ఘన విజయం సాధించి సీఐడీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఎన్నికల్లో మొత్తం 478 ఓట్లు పోలవగా, బెల్లపు స్వామికి 259 ఓట్లు లభించాయి. తన ప్రత్యర్థిపై 144 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించి రాష్ట్ర సీఐడీ ఉపాధ్యక్ష పదవిని కైవసం చేసుకున్నారు. ప్రత్యక్ష ఎన్నికల్లో స్వామి సాధించిన విజయంపై హుజురాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు. బెల్లపు స్వామి గతంలో కరీంనగర్ టాస్క్‌ఫోర్స్‌లో, జమ్మికుంటలో ఎస్సైగా విధులు నిర్వహించారు. సీఐడీ సిబ్బంది సంక్షేమం కోసం నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని పలువురు ఆకాంక్షించారు.

సీఐడీ డీజీని కలిసిన బెల్లపు స్వామి

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం బెల్లపు స్వామి సీఐడీ డీజీ చారు సిన్హా, ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తన ఎన్నికకు సంబంధించిన వివరాలను డీజీకి తెలియజేశారు. సీఐడీ సిబ్బంది సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని స్వామి తెలిపారు.

# బీఆర్ఎస్ సభ్యుల మండలి వాకౌట్

- 22ఏ భూములపై చర్చకు వాయిదా తీర్మానం



**హైదరాబాద్, సెప్టెంబర్ 10, (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ శాసనమండలి నుంచి బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. సభ కొనసాగుతున్న తీరుపై నిరసన వ్యక్తం చేస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు బీఆర్ఎస్ సభ్యులు తెలిపారు. 22ఏ నిషేధిత భూములకు సంబంధించిన సమస్యలపై వెంటనే చర్చ చేపట్టాలని కోరుతూ బీఆర్ఎస్ సభ్యులు వాయిదా తీర్మానాన్ని ప్రతిపాదించారు. అయితే మండలి చైర్మన్ ఆ తీర్మానాన్ని తిరస్కరించడంతో బీఆర్ఎస్ సభ్యులు నిరసనగా సభ నుంచి బయటకు వెళ్లారు. 22ఏ నిషేధిత భూముల అంశం రాష్ట్రంలోని పలువురు ప్రజలకు సంబంధించిన ముఖ్యమైన సమస్యగా ఉందని బీఆర్ఎస్ సభ్యులు పేర్కొన్నారు. ఈ అంశంపై మండలిలో చర్చ జరిపి ప్రజలకు స్పష్టత కల్పించాల్సిన అవసరం ఉందని వారు కోరారు. సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తక్షణమే చర్చకు అవకాశం ఇవ్వాలని వాయిదా తీర్మానం ద్వారా విజ్ఞప్తి చేసినప్పటికీ అనుమతి లభించలేదని బీఆర్ఎస్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. తీర్మానం తిరస్కరణ అనంతరం బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేసి బయటకు వచ్చారు. ఈ సందర్భంగా శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి మండలిలో మార్షల్స్ వ్యవహరించిన తీరుపై తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. మార్షల్స్ ద్వారా సభ్యుల గౌరవానికి భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను చర్చించేందుకు ఎన్నికైన ప్రజాప్రతినిధులకు తగిన అవకాశం కల్పించాల్సిన బాధ్యత సభపై ఉందని పేర్కొన్నారు. మరోవైపు శాసనమండలిలో బీఆర్ఎస్ సభ్యుల గొంతును అణచివేసేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య విరుద్ధమైన పద్ధతులను అనుసరిస్తోందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. సభ్యులను సస్పెండ్ చేయడం, మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకపోవడం, మైకులు ఇవ్వకపోవడం వంటి చర్యలతో ప్రతిపక్ష స్వరాన్ని అడ్డుకుంటున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలపై చర్చ జరగాల్సిన చట్టసభల్లో ప్రతిపక్షానికి మాట్లాడే అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. చట్టసభల్లో ప్రజల తరపున తమ వాణిని బలంగా వినిపించేందుకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు భవిష్యత్తులోనూ వివిధ మార్గాల్లో నిరసన కార్యక్రమాలు చేపడతారని పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రజలకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం తమ బాధ్యత అని, సభలో చర్చకు అవకాశం లభించకపోతే ప్రజాక్షేత్రంలో సమస్యలను ప్రస్తావిస్తామని పేర్కొన్నారు. ముఖ్యంగా భూముల సమస్యలు, రైతులు, పేదలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. 22ఏ భూముల సమస్యపై చర్చకు అనుమతి ఇవ్వకపోవడంతో చోటుచేసుకున్న వాకౌట్‌తో శాసనమండలిలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య మరోసారి విభేదాలు బయటపడ్డాయి. సభ సజావుగా సాగేందుకు అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య సమన్వయం అవసరమని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ప్రజా సమస్యలపై విస్తృత చర్చకు అవకాశం కల్పిస్తూ చట్టసభల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ఇరువర్గాలపై ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# ఓబీసీ కాలమ్‌పై అసెంబ్లీ తీర్మానం చేయాలి

- కేంద్రంపై ఒత్తిడి పెంచాలని సీఎం రేవంత్‌కు విజ్ఞప్తి



**హైదరాబాద్, సెప్టెంబర్ 10, (తెలంగాణ ముచ్చట్లు):** దేశవ్యాప్తంగా జరుగుతున్న జాతి జనగణనలో ఇతర వెనుకబడిన తరగతుల కాలమ్‌ను చేర్చేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు తెలంగాణ శాసనసభలో ఏకగ్రీవ తీర్మానం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ప్రస్తుత జాతి జనగణనలో ఇతర వెనుకబడిన తరగతులకు ప్రత్యేక కాలమ్ లేకపోవడం అన్యాయమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో నిర్వహించిన కులగణన తరహాలో దేశవ్యాప్తంగా ఇతర వెనుకబడిన తరగతుల కులాల వివరాలను ప్రత్యేకంగా సేకరించి, ప్రతి కులానికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం జరుగుతున్న శాసనసభ సమావేశాల్లో ఈ అంశంపై ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని కోరారు. ఈ మేరకు జాజుల శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. వడ్డెర సమాఖ్య అధ్యక్షురాలు గుంజ రేణుక, బీసీ కుల సంఘాల ఐక్య కార్యాచరణ సమితి అధ్యక్షుడు కుందారం గణేష్ చారి, సంచార జాతుల సంఘం రాష్ట్ర నాయకులు కాటేపల్లి వీరస్వామి, తిప్పిరిశెట్టి శ్రీనివాస్‌లతో కలిసి ఆయన ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. దేశవ్యాప్తంగా ఇతర వెనుకబడిన తరగతుల కులాల లెక్కలు సేకరిస్తామని కేంద్ర ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చిందని, అయితే ఆ హామీని అమలు చేయకుండా అన్యాయం చేసిందని జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. కులాల వారీగా సమగ్ర వివరాలు సేకరించడం ద్వారా ఆయా వర్గాల జనాభా, సామాజిక, ఆర్థిక పరిస్థితులకు సంబంధించిన వాస్తవ గణాంకాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ‘రణబాలి’లో హాలీవుడ్ విలన్.. అంచనాలు పెంచుతున్న ఆర్నాల్డ్ వోస్లూ



విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా ‘రణబాలి’ పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్న ఈ చిత్ర టీజర్ ఇటీవల విడుదలై సామాజిక మాధ్యమాల్లో సందడి చేస్తోంది. విజయ్ రఫ్ అండ్ ఇంటెన్స్ లుక్, యాక్షన్ సన్నివేశాలు ఆకట్టుకోగా.. టీజర్‌లో హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

‘ది మమ్మీ’ నటుడి పవర్‌ఫుల్ విలనిజం

హాలీవుడ్‌లో విలన్ పాత్రలతో గుర్తింపు తెచ్చుకున్న ఆర్నాల్డ్ వోస్లూ.. ‘రణబాలి’లో కీలక ప్రతినాయకుడిగా కనిపించనున్నట్లు టీజర్‌తో స్పష్టమైంది. డార్క్ షేడ్స్‌తో కూడిన ఆయన పాత్ర, సీరియస్ నటన సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. ముఖ్యంగా ‘ది మమ్మీ’ (1999), ‘ది మమ్మీ రిటర్న్స్’ (2001) చిత్రాల్లో హై ప్రీస్ట్ ఇమ్‌హోటెప్‌గా ఆయన నటన ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు తెచ్చుకుంది. దక్షిణాఫ్రికాకు చెందిన ఆర్నాల్డ్ వోస్లూ తొలుత రంగస్థల నటుడిగా కెరీర్ ప్రారంభించారు. ‘హామ్‌లెట్’, ‘ట్వెల్త్ నైట్’ వంటి నాటకాల్లో నటించారు. అనంతరం హాలీవుడ్‌లోకి అడుగుపెట్టి ‘హార్డ్ టార్గెట్’ చిత్రంలో ప్రతినాయకుడిగా మెప్పించారు. ఆ తర్వాత ‘డార్క్‌మ్యాన్’, ‘24’, ‘జి.ఐ. జో’, ‘బ్లడ్ డైమండ్’ తదితర చిత్రాలు, సిరీస్‌లలో కీలక పాత్రలు పోషించారు.

# ‘418’కు సెన్సార్ క్లియరెన్స్.. ‘ఏ’ సర్టిఫికెట్ జారీ




దర్శకుడు ప్రశాంత్ నీల్ సమర్పిస్తున్న తొలి హర్రర్ థ్రిల్లర్ సినిమా ‘418’. కన్నడ దర్శకుడు కీర్తన్ నడగౌడ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నిర్మించారు. చాలా రోజులుగా సెన్సార్ సమస్యలను ఎదుర్కొంటున్న ఈ చిత్రం ఎట్టకేలకు సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది.

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ఈ చిత్రానికి ‘ఏ’ సర్టిఫికెట్ జారీ చేసింది. భయానక హర్రర్ అంశాలతో తెరకెక్కిన ఈ సినిమాతో ప్రేక్షకులకు అసలైన భయం ఏంటో చూపించబోతున్నామని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు హర్రర్ సినిమాలను చూసి నవ్వుకున్నది చాలు.. ఇక భయపడే సమయం వచ్చింది అంటూ చిత్ర బృందం పేర్కొంది.

సూర్య రాజ్, చరణ్ లక్కరాజు, ప్రీతి పగడాల ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు దినేష్ దివాకర్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. సంచలన అంశాలతో కూడిన ఈ భయానక చిత్రంపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.



# బాలీవుడ్‌పై శ్రీలీల ఫోకస్

సినీ రంగంలో విజయాలు, పరాజయాల ప్రభావం కథానాయికల కెరీర్‌పై వేగంగా పడుతుంటుంది. ఒకప్పుడు వరుస అవకాశాలతో టాలీవుడ్‌లో దూసుకెళ్లిన శ్రీలీల.. ప్రస్తుతం కొత్త దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. డ్యాన్స్, గ్లామర్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో మంచి క్రేజ్ సంపాదించుకున్న ఆమె.. అగ్ర కథానాయకుల సరసన వరుసగా నటించినప్పటికీ ఆశించిన స్థాయిలో విజయాలు అందుకోలేకపోయిందనే అభిప్రాయం ఉంది. టాలీవుడ్‌లో అవకాశాలు కొంత తగ్గిన నేపథ్యంలో శ్రీలీల బాలీవుడ్‌పై దృష్టి పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. వైద్య విద్యను పూర్తి చేసుకున్న ఆమె.. ఇక పూర్తిస్థాయిలో సినిమాలపై దృష్టి సారించాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.బాలీవుడ్‌లో ఒకటి రెండు సినిమాలు చేయడం కాకుండా అక్కడే తన కెరీర్‌ను బలంగా నిర్మించుకోవాలనే ఆలోచనలో ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. అందులో భాగంగానే హైదరాబాద్ నుంచి ముంబైకి మకాం మార్చినట్లు, అక్కడ ఓ విలాసవంతమైన ఆస్తిని కూడా కొనుగోలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. హిందీ చిత్ర పరిశ్రమకు దగ్గరగా ఉండటం ద్వారా కొత్త కథలు, దర్శకులు, నిర్మాణ సంస్థలతో టచ్‌లో ఉండొచ్చని శ్రీలీల భావిస్తున్నట్లు తెలుస్తోంది. కార్తీక్ ఆర్యన్‌తో ఎంట్రీ బాలీవుడ్ స్టార్ హీరో కార్తీక్ ఆర్యన్ సరసన నటిస్తూ శ్రీలీల హిందీ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది. ఈ ప్రాజెక్ట్‌తో బాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఆమె ఆశిస్తున్నట్లు సమాచారం. ఇకపై దక్షిణాది చిత్రాలతో పాటు హిందీ సినిమాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని శ్రీలీల భావిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.



# వైరల్‌గా 80ల నాటి ఫోటోలు

సామాజిక మాధ్యమాల్లో ఏఐ ఆధారిత సరికొత్త ట్రెండ్ వైరల్‌గా మారింది. గతంలో ‘స్టూడియో గిబ్లీ’ ఏఐ ట్రెండ్ నెటిజన్లను ఆకట్టుకోగా.. ఇప్పుడు 1980ల నాటి రూపాల్లో తమను తాము చూసుకునే ‘వింటేజ్ 80s’ ట్రెండ్ హల్‌చల్ చేస్తోంది. ఏఐ సాయంతో ప్రస్తుత సెల్ఫీలను 1980ల కాలం నాటి ఫోటోలుగా మార్చుకుంటూ నెటిజన్లు సందడి చేస్తున్నారు.

సెలబ్రిటీలూ అదే బాటలో..

సామాన్యుల నుంచి సినీ, బుల్లితెర ప్రముఖుల వరకు ఈ ట్రెండ్‌ను ఆస్వాదిస్తున్నారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సహా పలువురు ప్రముఖులు తమ ఫోటోలను 80ల నాటి రూపాల్లోకి మార్చుకుని సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటున్నారు. అభిమానులు కూడా తమకు నచ్చిన హీరోహీరోయిన్ల ఫోటోలను అదే తరహాలో మార్చి వైరల్ చేస్తున్నారు.

అలేఖ్యా రెడ్డి ఫోటోలు వైరల్

తాజాగా దివంగత నటుడు నందమూరి తారకరత్న భార్య అలేఖ్యా రెడ్డి తన ఫోటోలను 1980ల నాటి వింటేజ్ రూపంలోకి మార్చి సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. ఈ ఫోటోలు ప్రస్తుతం వైరల్‌గా మారగా.. అలేఖ్య చాలా అందంగా, క్యూట్‌గా కనిపిస్తున్నారంటూ నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. పూరీ జగన్నాథ్ కుమార్తె పవిత్ర, యాంకర్ మంజూష, దర్శకుడు సుకుమార్ భార్య బబిత, సాయి పల్లవి, త్రిష తదితరుల 80ల నాటి రూపాల ఫోటోలు కూడా నెట్టింట సందడి చేస్తున్నాయి.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in